
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM

మంగళవారం, 19 నవంబరు 2024

3





ముఖాముఖి

నిబంధనలు పాటించని వ్యాపారులపై చర్యలు

» పి. ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఖమ్మం మార్కెట్ సెక్రెటరీ

ప్రశ్న: మార్కెట్‌లో మద్ధతు ధరలు దక్కేందుకు చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: రైతులకు మద్దతు ధర దక్కేలా మార్కెట్ కమిటీ నిరంతరం చర్యలు తీసుకుంటుంది, వ్యాపారులను ఎప్పటికప్పుడు అలెర్ట్ చేస్తూ సమన్వయం చేస్తున్నాం.

ప్ర: పత్తికి మద్దతు ధరలు దక్కడం లేదని విమర్శలు వస్తున్నాయి ఎందుకు?

జ: ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు పత్తి నాణ్యత కొంత మేర దెబ్బతిన్నది. చలి ప్రభావంతో పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉంటోంది. ఆరబెట్టిన పత్తికి ఖచ్చితంగా మద్దతు ధర లభిస్తుంది. మార్కెట్‌లో కూడా మద్దతు ధర చెల్లించాలని ఇటీవల 19 మంది పత్తి వ్యాపారులకు నోటీసులు జారీ చేశాం.

ప్ర: మార్కెట్‌లో ఎంతమంది వ్యాపారులు అందుబాటులో ఉన్నారు?

జ: మార్కెట్‌లో 205 మంది ట్రేడింగ్ లైసెన్స్ కలిగిన వారు ఉన్నారు. వారిలో 30 మంది వరకు పత్తి కొనుగోలు చేసే వ్యాపారులు కాగా, సుమారు 150 మంది మిర్చి కొనుగోలుదారులు. 618 మంది లైసెన్సు కలిగిన కమీషన్ వ్యాపారులు ఉన్నారు.

ప్ర: ఈ-నామ్(ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రి మార్కెటింగ్) వ్యవస్థలో ఏయే పంటలు కొనుగోలు చేస్తున్నారు?

జ: మార్కెట్‌లో పత్తి, అపరాలు ఈ-నామ్ పద్ధతిలో కొనుగోళ్లు జరుగుతున్నాయి.

ప్ర: బినామీ వ్యాపారులు, కమీషన్ ఎక్కువ తీసుకునే వ్యాపారులపై చర్యలు ఉంటాయా?

జ: బినామీ వ్యాపారులను మార్కెట్‌లోకి అనుమతించం. కమీషన్ నూటికి రెండు రూపాయల కంటే ఎక్కువ తీసుకునే వ్యాపారులపై ఖచ్చితంగా చర్యలు ఉంటాయి. అవసరమైతే వారి లైసెన్సులు రద్దు చేస్తాం.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సేఫ్ సిటీ.



మున్నేరు కు ఇరువైపులా తవ్వుతున్న రక్షణ గోడల పునాదులు



మున్నేరు వాగు

వరద ముంపునకు చెక్



కాంక్రీట్ గోడలకు ఫాండేషన్ నిర్మాణం

- » మున్నేరుకు ఇరువైపులా రక్షణ గోడలు
- » రూ.690 కోట్లతో 17 కి.మీ. మేర నిర్మాణం
- » రెండు గోడల మధ్య 230 మీటర్ల దూరం
- » 8నుంచి 15 మీటర్ల వరకు ఎత్తున గోడలు
- » మల్లెమడుగు నుంచి రామన్నపేట వరకు 2 కి.మీ. మేర కరకట్టలు
- » 2026 మార్చిలోగా పనుల పూర్తి లక్ష్యం
- » ఎట్టకేలకు కొలిక్కివచ్చిన మున్నేరు రివర్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు
- » మంత్రులు తుమ్మల, పొంగులేటి చొరవ ఫలితం

ఖమ్మం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వర్షాకాలంలో మున్నేరు వరదల నుంచి ఖమ్మం నగర వాసులకు రక్షణ కల్పించేందుకు వరద రక్షణ గోడలు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం వీటి పనులు ముమ్మరంగా సాగుతుండగా ఏడాదిన్నరలోగా నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వరసుగా రెండేళ్ల మున్నేరుకు గతంలో ఎన్నడూ లేని విధంగా వరద వచ్చి ఖమ్మం నగరంలోని పలు కాలనీలతో పాటు రూరల్ మండలంలోని పలు గ్రామాలను వరద ముంచెత్తింది. ఈ వరద నుంచి మున్నేరు పరివాహక ఇళ్లకు రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మున్నేరు రివర్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు కింద రూ.690 కోట్లతో చేపట్టిన వరద రక్షణ కాంక్రీట్‌వాల్స్ పనులు చకచకా సాగుతున్నాయి.

మున్నేరుకు ఇరువైపులా ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల పరిధిలో గత వారంరోజులుగా పనులు ముమ్మరం చేశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం నియోజకవర్గం, రెవెన్యూశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజకవర్గంలో ఈ పనులు చేపట్టడంతో వారిద్దరూ గోడల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించారు.

గత ఏడాది మున్నేరుకు 33 అడుగుల వరద రావడంతో అప్పట్లో 40 అడుగుల సామర్థ్యంతో గోడలను డిజైన్ చేశారు.

పనులు త్వరితగతిన పూర్తిచేస్తాం

ఖమ్మం మున్నేరుపై వరద రక్షణ గోడల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. 24 నెలల గడువుతో పనులు ప్రారంభించాం. నిర్మాణం ప్రారంభించి ఆరు నెలలైంది. ఇంకా ఏడాదిన్నరలోగా పనులు పూర్తిచేస్తాం. 2026 మార్చిలోగా పనులు పూర్తిచేసి మున్నేరు వరద నష్టం లేకుండా చర్యలు తీసుకుంటాం. ఈ ఏడాది వచ్చిన వరద మళ్లీ పునరావృతమైనా ఈ గోడల నిర్మాణంతో వరద ముప్పు ఉండదు.

రమేష్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ

రూ.690 కోట్లతో ఖమ్మంలో ప్రకాష్‌నగర్ నుంచి గోళ్లపాడు ఛానల్ వరకు మొత్తం రెండువైపులా 17 కి.మీ. ఈ గోడల నిర్మాణం చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరుకాగా టెండర్ల ప్రక్రియ పూర్తికావడంతో ప్రముఖ నిర్మాణ సంస్థ పటేల్ ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులు దక్కించుకుంది. గత మార్చిలోనే పనులు ప్రారంభం కాగా మున్నేరుకు రెండువైపులా బుష్‌క్లియరెన్స్‌తో పాటు పునాదులు తవ్వకాలు జరిపి కొన్నిచోట్ల పునాదిలెవల్ వరకు గోడ నిర్మించారు. అయితే మళ్లీ ఈ సంవత్సరం వర్షాకాలంలో మున్నేరు వరద బీభత్సం సృష్టించింది. గతంలో ఎన్నడులేని విధంగా 40 అడుగుల వరకు వరద రావడంతో ఖమ్మంనగరంలో పలు కాలనీలు, ఖమ్మంరూరల్ మండలంలోని పలు గ్రామాలు, కాలనీల్లో సుమారు 10 వేల ఇళ్ల వరకు వరద ముంపునకు గురయ్యాయి.

ఏడాదిన్నరలోగా...

ఖమ్మం మున్నేరుపై రెండువైపులా తలపెట్టిన ఆర్‌సీసీ వాల్స్ నిర్మాణం 24 నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటికే ఆరునెలలు గడిచింది. మరో ఏడాదిన్నరలోగా పనులు పూర్తిచేసి మున్నేరు వరదనుంచి పరివాహక ప్రజలకు విముక్తి కల్పించనున్నారు. మున్నేరులో మూడున్నర లక్షల క్యూసెక్కుల వరదనీరు వచ్చినా ఇబ్బంది రాకుండా ఉండేందుకు ఆర్‌సీసీ వాల్స్ నిర్మిస్తున్నారు. మున్నేరు రెండు రక్షణ గోడల మధ్య 230 మీటర్ల దూరం ఉంటుండగా నది లోతును బట్టి 8నుంచి 15 మీటర్ల వరకు ఎత్తున గోడలు నిర్మిస్తున్నారు. వీటితోపాటు మల్లెమడుగు నుంచి రామన్నపేట వరకు 2 కి.మీ వరకు కరకట్టలు నిర్మించనున్నారు. ఈ కాంక్రీట్‌వాల్స్‌తో ఎగువనుంచి వచ్చే వరదను ఖమ్మం నగరంతో పాటు రూరల్ మండలంలోని గ్రామాల్లోకి రాకుండా వెళుతుంది.

ఖమ్మం నగరంలోని మురికినీటితో పాటు వర్షపునీరు కూడా మున్నేరులో కలవకుండా ప్రత్యేకంగా డ్రెయినేజీలు రెండువైపులా ఏర్పాటు చేస్తున్నారు. మురికినీటి శుద్ధికి రెండు చోట్ల ట్రీట్‌ప్లాంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే పలుచోట్ల బతుకమ్మ వంటి ఉత్సవాల నిర్వహణకు ఘాట్లను నిర్మిస్తున్నారు. మున్నేరు ఆర్‌సీసీ వాల్స్‌కు డ్రెయినేజీకి మధ్యన ప్రత్యేకంగా డబుల్‌రోడ్డును కూడా నిర్మించి పర్యాటకంగా అభివృద్ధి చేయబోతున్నారు. రక్షణ గోడల నిర్మాణం తరువాత మున్నేరులో ఉన్న పోలేపల్లి చెక్‌డ్యాం ఎత్తును మరింతగా పెంచి నగరానికి అవసరమైన తాగునీటి రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడంతో పాటు పర్యాటకంగా ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కార్యచరణ సిద్ధమవుతోంది.

రూ.2.48 కోట్ల విలువైన గంజాయి దహనం

54 కేసుల్లో 993 కిలోలను పట్టుకున్న ఎక్సైజ్ సిబ్బంది

కొత్తగూడెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు, అశ్వరావుపేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల లోపట్టుబడిన 993 కిలోల గంజాయిని సోమవారం కాల్చిశారు. ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ జనార్ధన్ ఆదేశాల మేరకు 54 కేసుల్లో పట్టుబడిన గంజాయిని దహనం చేశారు. కాల్చివేసిన గంజాయి విలువ రూ. 2,48,25,000ఉంటుందని అంచనా వేశారు. గంజాయిని తల్లాడ మండలం గోపాల్‌పేట గ్రామంలో ఉన్న ఏడబ్ల్యూఎం కన్సటింగ్ లిమిటెడ్‌లో దహనం చేసినట్లు తెలిపారు. కొత్తగూడెం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో 25కేసుల్లోని 337.790 కిలోల గంజాయిని, పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్‌లో 15 కేసుల్లోని 408.371 కిలోల గంజాయిని, మణుగూరు ఎక్సైజ్ స్టేషన్‌లో రెండు కేసుల్లోని 52.520 కిలోల గంజాయిని, ఇల్లెందు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో పది కేసుల్లోని 108.372 కిలోల గంజాయిని, అశ్వరావుపేట ఎక్సైజ్ స్టేషన్‌లో రెండు కేసుల్లో 37,500 కిలోల గంజాయిని దహనం చేయించినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

గంజాయిని దహనం చేస్తున్న సమయంలో డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్యతోపాటు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల సీఐలు పాల్గొన్నారు.



పెనుబల్లిలో కమ్మ వన సమారాధనలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లిని ఎన్నటికీ మరువను...

» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

4



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఆందోళన చేస్తున్న పత్తి రైతులు

మద్దతు ధర ఇవ్వండి మహాప్రభో..

» ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి రైతుల ఆందోళన

4



పాలేరు కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ధాన్యం కొనుగోళ్లు సాఫీగా సాగాలి..

- » జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- » పాలేరులో కొనుగోలు కేంద్రం తనిఖీ

కూసుమంచి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో సోమవారం సన్నరకం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్టతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా నిర్వహకులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో పంట సాగుచేశారు? ఎంత దిగుబడి వచ్చింది? కొనుగోలు కేంద్రాలకు పంట తీసుకవచ్చి ఎన్ని రోజులవుతుంది? తేమ శాతం ఎంత ఉంది? టార్పలిన్ కవర్లు ఇస్తున్నారా? అంటూ నిర్వహకులను, రైతులను అడిగి తెలుసుకున్నారు.

ఈసందర్భంగా గన్నీ సంచులు లేకపోవడంతో సోమవారం కొనుగోలు నిలిచిపోయిందంటూ రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. దీంతో కలెక్టర్ నిర్వహకులపై, సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందే ఇండెంట్ పెట్టుకోవద్దా అంటూ ప్రశ్నించారు. ఆకస్మిక వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. డెలివరీ సమయంలో నాణ్యత పరిశీలించాలని తెలిపారు. తేమ రాగానే కాంటాలు వేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఓపీఎంఎస్ లో నమోదు చేయాలని ఆదేశించారు.సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. ఇది ప్రత్యేకంగా రైతుల ఎకౌంట్లలో జమచేస్తారని కలెక్టర్ తెలిపారు. ధాన్యం అమ్మే సమయంలో రైతులు ఇచ్చిన బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమచేయడం జరుగుతుందన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఎటువంటి ఆలస్యం చేయొద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ వెంట ఐకేపీ ఇన్చార్జ్ జ్యోతి, ఏపీఎం సత్యవర్ధన్ రాజు, ఏవో వాణి తదితరులు పాల్గొన్నారు.

బయటపడిన కల్తీ బాగోతం

- » నగరంలో రాష్ట్ర ఆహార తనిఖీ అధికారుల స్టింగ్ ఆపరేషన్
- » నాసిరకం పదార్థాలు, కెమికల్స్‌తో అల్లం వెల్లుల్లి పేస్టు తయారీ
- » మయూరి సెంటర్‌లో స్వీట్ షాపులో దుస్తుల రంగుల వాడకం
- » పురుగులు పట్టిన పిండితో హోమ్ ఫుడ్ ఐటమ్స్ తయారీ
- » నివ్వెరపోయిన అధికారులు.. బాధ్యులపై కేసుల నమోదు
- » 960 కిలోల అల్లం, వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం



వెల్లుల్లి నకిలీ పేస్టును స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో ఆహార పదార్థాల వ్యాపారంలో కల్తీలకు పాల్పడుతున్న పలువురు వ్యాపారుల గుట్టు రట్టయింది. దుస్తులకు వినియోగించాల్సిన రంగులను పుట్టిన రోజున కట్ చేసే అందమైన కేక్‌లపై వేసి అమ్మకాలు జరిపే వారు ఒకరైతే.. బహిరంగ మార్కెట్‌లో కిలో అల్లం ధర రూ.250 ఉండగా కల్తీ వ్యాపారులు మాత్రం కిలో రూ.60కే అమ్మకాలు జరిపే వారు మరొకరు.. ఇక శుచి శుభ్రత తమ ప్రత్యేకత అంటూ కాలం చెల్లిన పిండివంటలను విక్రయించే వారు ఇంకొకరు.. వీరి బాగోతాలకు సోమవారం రాష్ట్ర ఆహార తనిఖీశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు చెక్‌పెట్టారు. జిల్లా స్థాయిలోని అధికారులకు సమాచారం ఇవ్వకుండా వారు వ్యూహాత్మకంగా నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్, ఆకస్మిక తనిఖీలు సంచలనం సృష్టించాయి.

వ్యూహాత్మకంగా స్టింగ్ ఆపరేషన్

ఖమ్మం నగరంలో కల్తీ అల్లం, వెల్లుల్లి రాకెట్ ఐదేళ్లుగా కొనసాగుతోంది. తనిఖీలు జరిగి పట్టుబడిన ప్రతీసారి మరో ప్రాంతంలో మరో రూపంలో కల్తీ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటుగా ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాలకు ఖమ్మం నుంచే కల్తీ అల్లం, వెల్లుల్లి సప్లయ్ జరుగుతోందని రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదులు రావటంతో సోమవారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఒక బృందం ఖమ్మానికి చేరుకుంది.

ఓ చిరు వ్యాపారి నుంచి మ్యాజిక్ అల్లం, వెల్లుల్లి, కల్తీ వ్యాపారి ఫోన్ నెంబర్ సేకరించారు. తమ కుటుంబంలో ఓ పెద్ద ఫంక్షన్ ఏర్పాటు చేశామని, క్వింటా అల్లం, వెల్లుల్లి పేస్టు కావాలని కోరారు. కొన్ని గంటల తర్వాత కల్తీ వ్యాపారి లైన్‌లోకి వచ్చారు. ఈక్రమంలో కల్తీ అల్లం తయారీ ఒక చోట, అమ్మకం మరోచోట నిర్వహిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. దాదాపు మూడు గంటల పాటు స్టింగ్ ఆపరేషన్ చేసి రూ.లక్ష 35వేల విలువైన 960 కిలోల అల్లం, వెల్లుల్లి పేస్టును స్వాధీనం చేసుకున్నారు. నాసిరకం అల్లాన్ని గ్రైండ్ చేసి దానికి కెమికల్స్ కలిపి క్వాలిటీ అల్లంగా చలామణి చేస్తూ విక్రయిస్తున్నట్టు తేలింది. పైగా ఈ కల్తీ అల్లానికి హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ వ్యాపార సంస్థ స్టిక్కరింగ్ వాడటాన్ని గుర్తించారు. అనంతరం కల్తీ వ్యాపారి సాజిద్‌పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

మయూరిసెంటర్‌లోని ఓ ప్రముఖ స్వీట్ దుకాణంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. దుస్తులకు వినియోగించే రంగులను పుట్టిన రోజు కేక్‌లకు ఇతర స్వీట్‌లకు వాడటాన్ని గుర్తించారు. గడువు దాటిన పదార్థాలతో స్వీట్లు తయారు చేస్తున్నట్టు గుర్తించి కేసు నమోదు చేశారు. శాంతినగర్ ప్రాంతంలోని విజయలక్ష్మి పిండి వంటల దుకాణంలో పలు పిండి వంటలను పరిశీలించగా పురుగులు పట్టిన పిండి, బూజు పట్టిన స్వీట్లు తనిఖీల్లో కనిపించాయి. దీంతో అధికారులు కేసులు నమోదు చేశారు.


ఈ సందర్భంగా రాష్ట్ర ఆహార తనిఖీ టాస్క్‌ఫోర్స్ అధికారి జ్యోతిర్మయి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఫిర్యాదులు రావటంతో ఆకస్మికంగా తనిఖీలు చేశామని తెలిపారు. ఆహార నాణ్యతపై ఎటువంటి అనుమానాలు ఉన్నా రాష్ట్ర స్థాయి ఫిర్యాదుల నెంబర్ 91001 05795 కాల్ చేయాలని కోరారు.

ముగిసిన గ్రూప్-3 పరీక్షలు


» భద్రాద్రి జిల్లాలో స్వయంగా పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ

ఖమ్మం కలెక్టరేట్/కొతగూడెం, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా నిర్వహిచిన గ్రూప్ 3 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం ఉదయం 10గంటల నుంచి 12: 30గంటల వకు ఒక పరీక్ష, మధ్యాహ్నం 3గంటల నుంచి 5: 30గంటల వరకు రెండో పరీక్ష సోమవారం ఉదయం 10గంటల నుంచి 12: 30గంటల వరకు మూడో పరీక్ష నిర్వహించారు. అధికారులు తీసుకున్న అన్ని ముందస్తు చర్యలతో ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగలేదు. ఖమ్మం జిల్లాలో మొత్తం 27వేల 984 మంది అభ్యర్థుల కోసం 87 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా పరీక్షలకు హాజరుశాతం తక్కువగా నమోదయినట్లు తెలిసింది. దీనికి తోడు పరీక్షలకు హాజరైన లెక్కలను అధికారికంగా వెల్లడించడంలో అధికారులు గోప్యతను పాటించారు. ఇక భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా మొత్తం 30 సెంటర్లలో పరీక్ష నిర్వహించగా కొత్తగూడెంలో 26 సెంటర్లు, పాల్వంచలో 13 సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 13,478మంది అభ్యర్థులకు గాను 7,166మంది హాజరయ్యారు. 6,312 మంది గైర్హాజరయ్యారు. 53.17 హాజరు శాతం నమోదైంది. జిల్లా కలెక్టర్ జితేష్ వి . పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ పరీక్ష సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పలు సెంటర్లను తనిఖీ చేశారు. పోలీస్ యంత్రాంగం పరీక్షకేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేశారు.

రైటర్స్ కార్నర్



ఆయన పేరు కపిల రాంకుమార్.. ఖమ్మం నగరానికి చెందిన కవిగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని కవులకు సుపరిచితం.. ఖమ్మంలోని సరిత క్లినిక్ ప్రాంతంలో ఉండే ఈయన పేరు తెలియని వారు తెలుగు సాహిత్యంలో ఎవరూ ఉండరు. మహాకవి శ్రీశ్రీ, దేవులపల్లి కృష్ణశాస్త్రిల కవిత్వ సహచర్యం ఫలితంగా కవిత్వంవైపు మళ్లారు. 1952లో ఈయనకు దేవులపల్లి కృష్ణశాస్త్రి అక్షరాభ్యాసం చేయించారు. ఎంఏ తెలుగు లిటరేచర్ పూర్తి చేసి ఆ ప్రభావంతో కవిత్వం వైపు మళ్లారు.



సాహిత్య సృజనలో 'గురు'తర బాధ్యత


- కవిత్వంలో తనదైన ముద్ర చాటుతున్న కపిల రాంకుమార్
- వయసు పైబడినా తగ్గని సాహిత్యాభిమానం
- నూతనతరం కవులకు మార్గదర్శకత్వం

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొత్తగా కవిత్వంలోకి ప్రవేశించిన వారికి సాహిత్య పరమైన సలహాలు, సూచనలతోపాటు లోపాలను తెలియజేయటం ద్వారా రాంకుమార్ గురుతర బాధ్యత వహిస్తున్నారు.. ఆన్‌లైన్‌లో కవిత్వ వర్చువల్ గ్రూప్ కవి సంగమం అడ్మిన్‌గా చాలా సంవత్సరాలు సేవలందించారు. ఎస్సెస్పీలో టైపిస్టుగా పనిచేసి పదవీ విరమణ చేసి, పూర్తి స్థాయి కవిత్వ రచనకు మళ్లారు. కవిత్వరచనకు సాహిత్య సృజనకు వయస్సు పైబడటం అవరోధం కాదని చాటి చెపుతూ ఇటీవల మూడు కవిత్వ సంపుటాలు వెలువరించటంతో పాటు మరో నాలుగు పుస్తకాలను విడుదల చేసే కృషిలో నిమగ్నమయ్యాడు.

రాంకుమార్ రచనలు..

నగారా కవితా సంపుటిని రోటీన్‌కు భిన్నంగా వెలువరించి రాంకుమార్ సాహిత్యంలో కొత్త దనానికి తెరతీశారు. నగరా అనే కవితా సంపుటిని చేతి రాతతో తయారు చేసి పుస్తకంగా విడుదల చేయటం విశేషం. ఆ పుస్తకానికి కవితా లోకంలో లభించిన ఆదరణ దృష్ట్యా ఇటీవల దానిని ప్రింట్ రూపంలోకి తీసుకువచ్చారు. నగారా తోపాటు, ఉరుములు మెరుపులు, కవిత్వ కలగూర గంప పేర్లతో కవిత్వాన్ని రెండు పుస్తకాలుగా తీసుకు వచ్చారు. భరత సౌజన్యం అనే నాటకాన్ని రాశారు. మహాకవిశ్రీశ్రీని అభిమానించే రాంకుమార్ మాత్రా ఛందస్సులో కవిత్వాన్ని రాశారు. సాహిత్యంలో మినీలు, టుమ్రీలు, తదితర అనేక రకాల ప్రక్రియల్లో కవిత్వం రాయటం రాంకుమార్ మరో ప్రత్యేకత. ఇప్పుడేదీ తప్పు కాదు.. మీబాబాయి కవిత్వం, జానపద గేయసాహిత్యం, వ్యాస పీఠం, అనే పుస్తకాలు త్వరలో విడుదల కాబోతున్నాయి. అనేక కవితా సంకలనాల్లో రాంకుమార్ కవితలు చోటు చేసుకున్నాయి. సాహితీ స్రవంతి, తెలంగాణ సాహితీ సంస్థల ఆధ్వర్యంలో పలు సందర్భాల్లో కవితా సంకలనాలను వెలువరించారు.

విశిష్టసాహిత్య సేవ..



రాంకుమార్ కవిగానే కాకుండా సాహితీ స్రవంతి, తెలంగాణ సాహితి సాహిత్య సంస్థలకు ఎంతో కాలంగా సేవలందిస్తున్నారు. ఆయా సంస్థల్లో జిల్లా, రాష్ట్ర కమిటీల్లో ప్రాతినిధ్యం వహిస్తూ కొత్త పుస్తకాల విడుదలకు, సాహిత్య చర్చలు, సభలు, సమావేశాలకు తనవంతు సేవలందిస్తున్నారు. పలు రాష్ట్రాల్లో జరిగే సాహిత్య గోష్ఠులు, కార్యక్రమాలకు హాజరవుతూ ఖమ్మం అభ్యుదయ సాహిత్యగళాన్ని వినిపిస్తుంటారు. కవిత్వం తోపాటు అనేక అంశాలపై, కొత్తగా విడుదలయ్యే సాహిత్య సంపుటాలపై తనదైన శైలిలో వ్యాసాలు రాశారు. రంగస్థల నటుడిగా అనేక నాటకాలతోపాటు పలు టెలీఫిలిమ్స్, షార్ట్‌ఫిలిమ్స్‌లలో నటించాడు.

వడ్డీని వడిసి పట్టేదెలా...?

- తగ్గిపోతున్న 'వడ్డీ లేని రుణాల' సంఘాలు
- సకాలంలో కిస్తీలు చెల్లించకపోవడంతో వీఎల్ఆర్ అర్హతకు గండి
- ప్రతీ నెలా పెరుగుతున్న ఆర్థిక క్రమశిక్షణ లేని గ్రూపులు
- అధికారుల పర్యవేక్షణ లోపమే కారణం



స్వయం సహాయక సంఘాల సమావేశం

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వడ్డీ లేని రుణాలను(వీఎల్ఆర్) పొందడంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలో ఉన్న మహిళా వెనుకబడుతున్నాయి. తీసుకున్న రుణాలు సకాలం చెల్లిస్తేనే వడ్డీ లేని రుణంగా గుర్తించి, సభ్యులు చెల్లించిన వడ్డీని తిరిగి ఇస్తారు. ఖమ్మం జిల్లాలో 25వేల మహిళా స్వయం సహాయక సంఘాలు, భద్రాద్రి కొత్తగూడెంలో 20వేల మహిళ స్వయం సహాయక సంఘాలు కొనసాగుతున్నాయి. ఆయా సంఘాల పర్యవేక్షణకు ఇరు జిల్లాలో డీపీఎం(డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్)లను నియమించారు. అయితే వీరు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)లపై సరైన పర్యవేక్షణ చేయక పోవడంతో సంఘాల ఆర్థిక క్రమశిక్షణ తగ్గింది. దీంతో తిరిగి రుణాలు చెల్లింపులులో జాప్యం జరుగుతోంది.

భారీగా తగ్గిన వీఎల్ఆర్ (వడ్డీ లేని రుణాలు) సంఘాలు

గతంలో ఖమ్మం జిల్లాలో 14వేల సంఘాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 10వేల సంఘాలు వడ్డీ మాఫీ వీఎల్ఆర్‌కు అర్హత పొంది, లబ్ధిపొందాయి. కానీ ఈ సంవత్సరం ఖమ్మం జిల్లాలో 3,983 ఎస్‌హెచ్‌జీలు, భద్రాద్రి కొత్తగూడెంలో 2,774 ఎస్‌హెచ్‌జీలు మాత్రమే వడ్డీ మాఫీకి అర్హత పొందాయి. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 6,757 మహిళా స్వయం సంఘాలకు రూ.2,56,72,739 నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. వడ్డీ మాఫీ నిధులు ఎస్‌పీఏ మహిళ సభ్యుల బ్యాంకు ఖాతాలకు చేరనున్నాయి.

సకాలంలో చెల్లిస్తే వీఎల్ఆర్ గుర్తింపు...

మహిళా సంఘాల్లో ఆర్థిక క్రమశిక్షణ పెంపొందించేందుకు నిర్ణీత సమయంలో తిరిగి బ్యాంకుకు రుణాలు చెల్లించిన సంఘాలను వీఎల్ఆర్ (వడ్డీ లేని రుణాలు) సంఘాలుగా గుర్తిస్తున్నారు. ఇలా వీఎల్ఆర్ సంఘాలకు వడ్డీలను మాఫీ చేసి, వారు కోరిన మేరకు రుణ పరిమితి లక్ష్యాలను పెంచుతున్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించని సంఘాలను నాన్ పెర్ఫార్మెన్స్ అసెట్ (ఎన్‌పీఏ)గా గుర్తించి వాటిపై ఆర్థిక పరమైన కట్టడి చేస్తున్నారు.

ఘతమెంతో ఘనం..

మూడేళ్ల క్రితం వరకు రాష్ట్రంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా మహిళా సంఘాలు తమదైన ప్రత్యేకతను చాటుకున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 24వేల మహిళా సంఘాలు వీఎల్ఆర్ జాబితాలో చేరాయి. ఆయా సంఘాల సభ్యులకు వడ్డీ లేకుండా ఆదర్శవంతమైన సంఘాలుగా గుర్తింపు పొందాయి. రాష్ట్ర స్థాయిలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా జిల్లా ప్రథమ, ద్వితీయ బహుమతులను గెలుచుకుంది.

ఆరు మాసాల్లోనే తిరిగి రుణం..

మారుతున్న కాలంతో పాటుగా ప్రజల ఆర్థిక అవసరాలు మారుతున్నాయి. కొవిడ్ తర్వాత ఎప్పుడు ఏ ఆర్థిక అవసరం వస్తుందో తెలియని పరిస్థితి ఎదురైంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం క్యాష్ క్రెడిట్ లిమిట్ ప్లాన్‌ను బ్యాంకు లింకేజీలకు ఏర్పాటు చేసింది. గతంలో ఓ మహిళా సభ్యురాలు రూ.2లక్షలు బ్యాంకు లింకేజీ తీసుకుంటే మొత్తం డబ్బులు చెల్లించే వరకు తిరిగి బ్యాంకులో అప్పులు ఇచ్చే వారు కాదు. కానీ క్యాష్ క్రెడిట్ లిమిట్ మేరకు ఓ సభ్యురాలు బ్యాంకు లింకేజీ తీసుకున్న ఆరు మాసాల తర్వాత చెల్లించిన మొత్తంలో అప్పటి వరకు వడ్డీ పోను మిగిలిన సొమ్మును రుణంగా పొందేందుకు వెసులుబాటు కల్పించారు. ఇలా ఎన్నిసార్లైనా వ్యక్తిగతంగా మహిళ సభ్యులు రుణం తీసుకొనే వీలు ఉంది. ఈ విషయాన్ని బ్యాంకు లింకేజీ అధికారులు ఎస్‌హెచ్‌జీలకు అవగాహన కల్పించలేక పోయారు.

మద్దతు ధర ఇవ్వండి మహాప్రభో

ఖమ్మం మార్కెట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తాము స్వచ్ఛందంగా క్వింటాలు పత్తికి రెండు కిలోల తరుగు ఇస్తామని, తమ పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి రైతులు సీసీఐ అధికారులకు మొర పెట్టుకున్నారు. పత్తి కొనుగోళ్లను పరిశీలించేందుకు సోమవారం మార్కెట్‌కు వచ్చిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) బ్రాంచ్ మేనేజర్ అర్జున్‌భాగేను రైతులు చుట్టుముట్టారు. తేమ శాతం పేరుతో సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలు పెడుతున్నారని, ఆయా కేంద్రాలను మార్కెట్లోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. సీసీఐ కేంద్రాలు ఎక్కడో దూరంగా ఉన్నాయని, జిన్నింగ్ మిల్లుల వద్దకు చేరుకోవాలంటే రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని, అక్కడ తేమ శాతం ఎక్కువ ఉందని కొనుగోలు చేయకపోతే ఇంటికి తీసుకెళ్లి మళ్లీ బస్తాల్లో తొక్కి మార్కెట్‌కు తీసుకురావడం వల్ల రవాణా ఖర్చులు రెంటింపవుతున్నాయని, దీనివల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో సీసీఐ కేంద్రం ఉంటే ఇక్కడ అమ్ముకోవడం వల్ల రైతులకు గిట్టుబాటు అవుతుందన్నారు. ఈ సందర్భంగా సీసీఐ మేనేజర్ అర్జున్ భాగే మాట్లాడుతూ 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉన్న లూజు పత్తిని సీసీఐ కేంద్రాలకు తీసుకు వస్తే ఎలాంటి తరుగు లేకుండానే కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. కాగా ఆందోళన చేస్తున్న రైతులను మార్కెటింగ్‌శాఖ డీఎంవో అలీం, మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి సముదాయించి మార్కెట్‌లో రైతులకు న్యాయం చేస్తామని, మద్దతు ధర కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.



విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

విద్యార్థి దశ నుంచే ప్రయోగాలపై దృష్టిపెట్టాలి

- ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డి
- భద్రాద్రి జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రారంభం

అన్నపురెడ్డిపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయతనే ఆధారం చేసుకొని మానవుడు మనుగడ సాగిస్తున్నాడని, అభివృద్ధి చెందుతున్నాడని ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అన్నపురెడ్డిపల్లిలో విక్రమ్ అంబాలాల్ సారాభాయ్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఎమ్మెల్సీ ఎ. నర్సిరెడ్డితో కలిసి ఎంపీ రఘురాం రెడ్డి ప్రారంభించారు. ముందుగా ఎంపీ రఘురాం రెడ్డి శివాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీ మాట్లాడుతూ ప్రాథమిక విద్య నుంచే విద్యార్థులకు ప్రయోగాల పట్ల ఆసక్తి పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్లు, వైద్యంలో రోబోలు పనిచేస్తున్నాయని, ఇదంతా సైన్స్‌తో జరిగిన ప్రయోగాలవల్లేనని తెలిపారు.

సృజనాత్మకత వెలికితీయటానికే...

విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలుగులోకి తేవాలనే లక్ష్యంలో అన్నపురెడ్డిపల్లిలో సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ఇటువంటి ప్రదర్శనల వల్ల విద్యార్థులకు మేలు జరిగిదని ఉపాధ్యా వృత్తి నుంచి వచ్చిన తనకు తెలుసన్నారు. ఇటి వంటి వైజ్ఞానిక ప్రదర్శనలు నిరంతరం జరపాలని, అప్పుడే విద్యార్థులకు మరింత అవగాహన ఏర్పడుతుందన్నారు. తన నియోజక వర్గంలో విద్య, వైద్యం కోసం నిధులు అధికంగా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు..

వైజ్ఞానిక ప్రదర్శనలో 800 ఎగ్జిబిట్స్ వచ్చాయి. మెదటి రోజు కొందరు విద్యార్థులు ప్రదర్శించిన ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రతకు ఆరోగ్యానికి ఔషధ మొక్కలు, ప్రకృతి, సమీకృత వ్యవసాయంపై రూపొందించిన ప్రాజెక్టు నమూనాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమం నిర్వహణకు జిల్లా కాంగ్రెస్ నాయకుడు పర్సా వెంకటేశ్వరావు, వనమా గాంధీ, రమణ సహకరించగా, డీఈవో వెంకటేశ్వరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాలో 17శాతం సీఎం రైస్ బాకీ

వైరా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో ఇంకా ప్రభుత్వానికి కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) కింద మిల్లుల నుంచి 17శాతం బియ్యం బాకీ ఉందని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి చందన్‌కుమార్ తెలిపారు. ఈనెల 30వతేదీలోగా బాకీ ఉన్న సీఎం రైస్‌ను రికవరీ చేసేందుకు చర్యలు వేగవంతం చేశామని పేర్కొన్నారు. ఎర్రుపాలెంలోని ఓ రైస్‌మిల్లు నుంచి బాకీ ఉన్న సీఎం రైస్ లోడ్ వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులోని సివిల్‌సప్లయీస్ గోదాముకు వచ్చిన సమాచారం మేరకు డీఎస్‌వో చందన్‌కుమార్ సోమవారం ఆ లోడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. గత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని 66మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ రైస్ కోసం 1,20,533మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇచ్చామని తెలిపారు. ఈ ధాన్యానికి సంబంధించి 80,903 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లుల నుంచి ప్రభుత్వానికి రావల్సి ఉండగా ఇప్పటివరకు 66,392(83శాతం)మెట్రిక్ టన్నుల సీఎం రైస్ రికవరీ వచ్చాయని వివరించారు. డిపాల్ట్ అయిన మిల్లులు సహా ఇంకా 14,510మెట్రిక్ టన్నుల(17శాతం) బియ్యం ప్రభుత్వానికి బాకీ ఉందని పేర్కొన్నారు. ఈనెల 30వతేదీలోగా బాకీ ఉన్న 17శాతం బియ్యాన్ని కూడా మిల్లుల నుంచి రాబట్టేందుకు చర్యలను వేగవంతం చేశామని తెలిపారు. సివిల్ సప్లయీస్ ఆర్ఐ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఇబ్బడిముబ్బడిగా యాంటీబయాటిక్స్ వాడొద్దు

- డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇబ్బడి ముబ్బడిగా యాంటీబయాటిక్ మందులను వినియోగించవద్దని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి అన్నారు. సొంత నిర్ణయాలతో యాంటి బయాటిక్స్ వాడటం, అవగాహన లేని ఆర్ఎంపీలు, పీఎంపీలు చెప్పారని, యాంటి బయాటెక్స్ వాడితే మనిషి బాడీ వ్యవస్థ దెబ్బ తినే ప్రమాదం ఉందని ఆమె అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి వారం రోజుల పాటు ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ కార్యక్రమంపై అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తోన్నట్లు ఆమె తెలిపారు. నగరంలోని మామిళ్లగూడెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరం లేకున్నా యాంటీ బయాటిక్స్ వాడటం వలన రాబోయే కాలంలో వచ్చే జబ్బులకు మందులు పనిచేయక జబ్బులు దీర్ఘకాలం మెండిబారతాయని అన్నారు.

నేడు బీసీ కమిషనర్ రాక

చుంచుపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బీసీ కమిషన్ ఖమ్మం జిల్లాలోని ఐడీవోసీకి మంగళవారం రానున్నట్లు భద్రాద్రి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇందిరా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు బీసీ కమిషన్ అధ్యక్షుడు జి.నిరంజన్, రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్ తదితరులు వస్తున్నట్లు తెలిపారు. బీసీ, వివిధ కుల సంఘాల నాయకులు వినతులు, అభ్యంతరాలు, సలహాలు, సూచనలు లిఖితపూర్వకంగా సమర్పించవలసినదిగా ఆమె ఆ ప్రకటనలో కోరారు.

ఆలయాల్లో వైభవంగా 'కార్తీక' పూజలు



కలువ పూలతో స్వామివారికి అభిషేకం



సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

దమ్మపేట, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): దమ్మపేట, ముష్టిబండ, నాచారం గ్రామాలలోని శివాలయాలలో కార్తీకసోమవార పూజలు, అభిషేకాలు వైభవంగా జరిగాయి. ముష్టిబండ దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వయంగా అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సోమవారం తెల్లవారు జాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అభిషేకాలు నిర్వహించారు. 101 కలువ పూలతో శివలింగానికి అభిషేకం చేసి అంకరణ చేసారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, సహస్ర దీపాలు, అకాశ దీపం వెలిగించి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ రావు గంగాధరరావు, కోశాధికారి సుబ్బారావు తదితరులు ఏర్పాట్లు చేశారు.

రాజకీయ జన్మనిచ్చిన సత్తుపల్లిని మరువను: తుమ్మల

పెనుబల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయ జన్మనిచ్చిన సత్తుపల్లి నియోజకవర్గాన్ని ఎప్పటికీ మరువనని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పెనుబల్లి మండల కాకతీయ కమ్మ సామాజిక వనసమారాధనలో తుమ్మల పాల్గొని ప్రసంగించారు. సత్తుపల్లి నియోజకవర్గానికే మొదటి ప్రాధాన్యం అని, తన శ్వాస ఉన్నంతవరకు సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉంటానని, నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టిసారిస్తానన్నారు. పరిస్థితులకనుగుణంగా తన పద్ధతి, ఆలోచన, కార్యాచరణ, నడవడిక, ప్రగతి కొనసాగుతుందన్నారు. కమ్మజాతి కీర్తి ప్రతిష్ఠతను ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు. పూర్వీకులు ఇచ్చిన చరిత్రను దృష్టిలో పెట్టుకోవాలని, గతం తెలియకుండా భవిష్యత్‌ను నిర్దేశించలేమని, కమ్మ సామాజిక చరిత్రను రాబోయే తరాలకు తెలియజేయాలన్నారు. దివంగత నాయకుడు ఎన్టీఆర్ బాటలో నడవాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మన్ నున్నా రామకృష్ణ, కారాయిగూడెం సొసైటీ అధ్యక్షుడు చింతనిప్పు సత్యనారాయణ, చీకటి రామారావు, సూర్యదేవర రవికుమార్, తాళ్లూరి రవి, మందడపు అశోక్‌కుమార్, తాళ్లూరి శేఖర్‌రావు, బెల్లంకొండ శ్రీనివాసరావు, పలు గ్రామాలకు చెందిన కమ్మజనులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు రైతులకు లాభం

- తగిన పోషకాలు ఉపయోగించే అవకాశం
- జిల్లాలో 2 భూసారపరీక్ష కేంద్రాలు
- యాసంగి మట్టి నమూనాల లక్ష్యం 1905
- ఒక్కో నమూనా పరీక్షకు రూ.10 రుసుము..

ఖమ్మం వ్యవసాయం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇష్టారీతిన రసాయనిక ఎరువుల వినియోగంతో సాగుభూమి సారం కోల్పోయి నిర్జీవంగా మారుతుంది. పంట భూమిలో నత్రజని, భాస్వరం, సేంద్రియ కర్బనాల్లాంటి పోషకాలు ఎంత మోతాదులో ఉన్నయో భూసార పరీక్షల ద్వరా తెలుసుకుని వాటికి తగ్గట్టుగా మొక్కలకు ఎరువులను అందిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చ.

పెట్టుబడి వ్యయం కూడా తగ్గుతుంది. భూసార ఫలితాల్లో ఏ భూమి తేలిక నేల, బరువు నేల తదితర విషయాలు తెలుస్తాయి. వ్యవసాయ భూముల్లో సహజంగా ఉండే పోషక పదార్థాల తోపాటు అదనంగా సేంద్రియ ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటే అధిక దిగుబడి సాధించ వచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

అందుబాటులో రెండు కేంద్రాలు..

ఖమ్మం జిల్లాలో రెండు భూసార పరీక్ష కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన ఖమ్మం జిల్లా కేంద్రంలో ఒక కేంద్రం ఉండగా, మరొక కేంద్రం సత్తుపల్లిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ భూసార కేంద్రం. ఈ రెండు కేంద్రాలో మట్టి నమూనాలకు పరీక్షలు నిర్వహిస్తుంటారు. 2024 రబీ (యాసంగి) సీజన్‌కు సంబంధించి 1905 మట్టి నమూనా పరీక్షలు లక్ష్యంగా ఉన్నాయి.

ఈ నమూనాలను క్షేత్రస్థాయిలో వ్యవసా య సిబ్బంది ద్వారా సేకరిస్తారు. ఒక వేళ రైతులు స్వచ్ఛందంగా మట్టి నమూనాలను ప్రయోగశాలకు తీసుకువస్తే ఒక్కో నమూనాకు రూ.10 రుసుం తీసుకుని పరీక్ష చేసి రిపోర్టులను అందజేస్తారు. మట్టి నమూనాలు సుమారు 1 ఎకరం నుంచి 5 ఎకరాల వరకు ఒక నమూనా చొప్పున సేకరిస్తారు.

రైతులకు లాభాలు ఇవీ..

భూ పరీక్షల ద్వారా భూమి స్వభావం తెలుస్తుంది. మృత్తిక ఏ రకానికి చెందిందో తెలుస్తుంది. దానిలో ఉన్న పోషక పదార్థాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తుంది. వాటిని బట్టి రైతులు పంటలు సాగు చేస్తే వృథా ఖర్చులు ఉండవు. పరీక్షా ఫలితాల్లో ఏ భూమి తేలిక నేల, బరువు నేల, మధ్యస్థంగా ఉన్న నేల అనే విషయాలు తెలుస్తాయి. నేలకు అమ్లగుణం ఉంటే వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సున్నం వాడి స్థాయి తగ్గించవచ్చు.

నమూనాలను సేకరించే విధానం..

పొలాల్లో పంట లేని సమయంలో మాత్రమే భూసార పరీక్షలకు మట్టి సేకరించాలి. నేల పొడిగా ఉన్నప్పుడు పొలం ఆరి ఉన్నప్పుడు మాత్రమే తీసుకోవాలి. సరిగ్గా చెప్పాలంటే మార్చి నుంచి మే నెల మధ్య సేకరించాలి. పండ్ల తోటలు సాగు చేసే రైతులు చెట్లకు ఎరువు వేయక ముందే మట్టి నమూనాలు తీసుకోవాలి. మట్టి వెళ్లే లోతు వరకు, ఏక వార్షిక పంటలకు 15 నుంచి 30 సెంటీమీటర్ల లోపు మట్టి నమూనాలను సేకరించాలి. పొలంలోని గట్ల వద్ద, పంట కాల్వల్లో సేకరించకూడదు. మొక్కలు, చెట్ల కింద, చెట్ల పక్కన ఉన్న మట్టిని సేకరించకూడదు. కంపోస్టు, పశువుల ఎరువుల కుప్పలు ఉంచిన చోట, బురదగా ఉన్న నేల నుంచి నమూనాలు పనికిరావు. నమూనాలు తీసేటప్పుడు నేల పైభాగంలోని చెత్తాచెదారాన్ని తీసివేయాలి. తీసిన చోట తేమ ఎక్కువగా ఉంటే నమూనాను నీడలో ఆరబెట్టాలి. ఎండలో ఆరబెట్టకూడదు. మట్టిని ఒక చోట నుంచి కాకుండా 10 నుంచి 15 ప్రాంతాల్లో తీయాలి. ఎంపిక చేసిన పొలంలో జిగ్‌జాగ్ (ఎగుడు దిగుడు) పద్ధతిలో సేకరించాలి. మట్టి తీసేందుకు పొలంలో ఒక అంగుళం (2.5 సెంటీమీటర్లు) మందం పారతో పై నుంచి కిందికి గియాలి. అలా తీసిన మట్టిని పట్టా, చిన్న బకెట్‌లో సేకరించాలి. ఒక చోట బండ మీద కానీ, శుభ్రమైన పేపర్‌పై ఉంచాలి. నమూనాను పాలిథిన్ సంచి, గుడ్డ సంచుల్లో నింపి ప్యాక్ చేసి సమీపంలో ఉన్న భూసార పరీక్షా కేంద్రాలకు పంపించాలి. మట్టి నమూనాతో పాటు రైతు పేరు, సర్వే నెంబర్, గ్రామం, మండలం, సదరు భూమిలో సాగు చేసిన పంటలు, ఇప్పుడు సాగు చేయబోయే పంటల వివరాలు, ఫోన్‌నెంబర్‌ను జత చేయాలి.



మట్టి నమూనా సేకరిస్తున్న దృశ్యం

పచ్చిరొట్ట సాగుతో ఎన్నో ప్రయోజనాలు

రైతులు పచ్చిరొట్ట సాగుతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. వానకాలం సాగుకు సన్నద్ధమవుతున్న వేళ ప్రతి రైతు తన భూమి, నేల సారం గురించి అవగాహన తప్పకుండా తెలుసుకుని ఉండాలి. ప్రస్తుతం నేలలో సేంద్రియ కర్బన శాతం రోజురోజుకు తగ్గిపోతున్నది. ఈ కారణంగా పంట దిగుబడులు తగ్గిపోతున్నాయి. నేల తిరిగి సారాన్ని పొందాలంటే రైతులు కచ్చితంగా పచ్చిరొట్ట సాగు చేయాలి. పచ్చిరొట్టను భూమిలో కలియదున్నితే నేల సారవంతమవుతుంది. నేలలో సేంద్రియ కర్బనశాతం అనుకూల, సూక్ష్మజీవుల సంఖ్య, నీటి నిల్వ ఉంచుకునే సామర్థ్యం పెరుగుతుంది.

చిన్నారి వైద్యానికి రూ.25 వేలు అందజేత

భద్రాచలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనీకి చెందిన ఎస్.రాధ బిడ్డ పుట్టుకతోనే నిమోనియాతో బాధపడుతుండటంతో ఐటీడీఏ పీవో బి.రాహుల్ చంటిపాప వైద్య ఖర్చుల కోసం ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి రూ.25 వేలను వైద్య ఖర్చుల నిమిత్తం సోమవారం ఆమెకు అందజేశారు. మెరుగైన వైద్య చికిత్స అందించి పాప ఆరోగ్యం కుదుటపడేలా చూడాలని పీవో తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్‌వో భాస్కరన్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలాయపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలనుంచి అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను ఎస్ఐ కూసుపుడి జగదీష్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. మండలంలోని ఆకేరు, పాలేరు నదినుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఖమ్మంకు తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను సోమవారం తెల్లవారుజామున ఎస్ఐ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. పట్టుకున్న వాటిని స్థానిక పోలీసు స్టేషన్లకు ఉంచి కేసు నమోదుచేశారు.

విద్యా, వైద్యానికి దూరమవుతున్న ఆదివాసీలు

ఆదివాసీ సమస్యలపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు రాష్ట్ర నాయకుడు వినతి


గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకుడు

ఇల్లెందురూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులు విద్యవైద్యానికి దూరం అవుతున్నారని, సరైన సౌకర్యాలు అందక ఆదివాసులు అడవుల్లోనే మృత్యువాత పడుతున్నారని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర నాయకులు పెండకట్ల యాకయ్య దొర రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి రాష్ట్రంలో ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై గవర్నర్‌కు వివరించారు. విద్య, వైద్యం అందుబాటులో లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లలేక ఆదివాసీ బిడ్డలు చదువుకు దూరమవుతున్నారని, రోగాల బారిన పడి చనిపోతున్నారని వివరించారు. పోడు భూములకు పట్టాలు ఉన్న అటవీ అధికారుల సాగుచేయనియకుండా అడ్డుపడుతున్నరని, అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. ఇప్పటికి అనేక ఆదివాసీ గూడేలల్లో సరైన రహదారు లేక వాగులపై బ్రిడ్జిలు లేక ఆదివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గర్భిణులు వాగులు దాటలేక అవస్థలు పడుతున్నారని, ఏజెన్సీ గ్రామాల్లో వైద్యం అందుబాటులోకి తేవాలని ఆయన కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆదివాసీల సంబంధించిన ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుకు కృషి చేయాలని, కొమరం భీం పేరుతో ఆదివాసీ విద్యార్థులకు గ్రంథాలయం ఏర్పాటు చేసే విదంగా గవర్నర్ చర్యలు తీసుకోవాలని యాకయ్యదొర కోరారు.

రైతులకు ఇబ్బందులు కల్గించొద్దు

కేంద్రాలను పరిశీలించిన ఎంపీ రఘురాంరెడ్డి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అధికారులను ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం, కాచిరాజుగూడెం పంచాయతీ పరిదిలోని వాల్యాతండా గ్రామంలో ఏదులాపురం సహకారం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎంపీ రఘురాంరెడ్డి ప్రారంబించారు. ఆయన మాట్లాడుతు రైతులు తెచ్చే ధాన్యం వీలైనంత త్వరగా కాటాలు వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మద్దులపల్లి మార్కెట్ ఛైర్మన్ హరినాదబాబు, నాయకులు వెంకటరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెట్టొద్దు: సీపీ

ముదిగొండ/నేలకొండపల్లి, నవంబరు (ఆంధ్రజ్యోతి): సీసీఐ పత్తి కొనుగోళ్లలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కల్గించొద్దని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సీసీఐ అధికారులను ఆదేశించారు. ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం వద్ద ఓ జిన్నింగ్‌మిల్లులో ఏర్పాటుచేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పత్తి అమ్ముకోవడానికి వచ్చిన రైతులకు ఎటువంటి ఇబ్బందులు కల్గించకుండా సత్వరమే కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులకు సూచించారు. సీఐ మురళీ పాల్గొన్నా రు.

నేలకొండపల్లి మార్కెట్ సందర్శన

నేలకొండపల్లి (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్‌ను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సోమవారం సందర్శించారు. మార్కెట్ కార్యాలయ ఆవరణలో ఉన్న రైతువేదిక వద్దకు వచ్చిన సీపీకి నేలకొండపల్లి మండల పరిధిలోని చెర్వుమాధారం రెవెన్యూలో పొలం ఉన్న ముదిగొండ మండలం బాణాపురానికి చెందిన రైతు తేజావత్ నాగేశ్వరరావు తన గోడును వెళ్లబోసుకున్నారు. ఇటీవల వచ్చిన వరదల్లో తన పంట కొట్టుకుని పోయిందని, అయి నా తనకు ఇంత వరకు నష్టపరిహారం అందలేదని ఆవేదనతో చెప్పుకున్నాడు. వెంటనే సీపీ ఏవోని రాధను పిలిపించి తెలుసుకున్నారు. తాను పరిశీలిస్తానని, న్యాయం చేస్తానని వ్యవసాయాధికారి రైతుకు హామీ ఇచ్చారు. పత్తి కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సింగారెడ్డిపాలెం గురుకుల బాలికల పాఠశాల/కళాశాలను సందర్శించారు. కళాశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

త్రిపుర బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో
ఉమ్మడి జిల్లా కళాకారులకు చోటు


త్రిపుర బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన నాట్య గురువులతో ఖమ్మం, పాల్వంచ కళాకారులు

ఖమ్మం ఖానాపురంహవేలి/పాల్వంచటౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన అభినయ రుద్ర నాట్యాలయానికి త్రిపుర బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించింది. హైదరాబాద్‌లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమి ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం నృత్య మహోత్సవం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 330 మంది నృత్య కళాకారులు పాల్గొనగా ఖమ్మం నగరానికి చెందిన చిన్నారులు సోలో గ్రూఫ్ విభాగాల్లో సత్తా చాటి బహుమతులు అందుకున్నారు. త్రిపుర బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు చిన్నారులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు.

పాల్వంచ వాసికి సత్కారం

జై సంతోషిమాత నాట్య నిలయం గురువు, పాల్వంచ వాసి వరలక్ష్మికి త్రిపుర బుక్ఆఫ్ రికార్డు గుర్తింపు అవార్డు దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లో పొట్టి శ్రీరాములు యూనివర్సిటి ఆడిటోరియంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో నాట్య నిలయం నుంచి పాల్గొన్న 21మంది శిష్య బృందం అద్భుతమైన నృత్య ప్రదర్శనలు చేసినందుకు గాను తనకు ఈ అవార్డుతోపాటు పురస్కారం దక్కిందని నాట్య గురువు వరలక్ష్మి సోమవారం తెలిపారు. అవార్డు సాధించిన నాట్య గురువు వరలక్ష్మిని, శిష్య బృందాన్ని పాల్వంచ వర్తక సంఘం కన్వీనర్ చలువాది ప్రకాష్‌తోపాటు పలువురు అభినందించారు.

కాశీవిశ్వేశ్వరస్వామికి అభిషేకం, పుష్పాంజలి

గోదావరికి నదీ హారతి

భద్రాచలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని పంచామృతాభిషేకం నిర్వహించారు. అలాగే వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా రామాలయం ప్రాంగణంలోని చిత్రకూట మండపంలోని సత్యనారాయణస్వామి వ్రతాల్లో భక్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని పవిత్ర గోదావరికి నదీ హారతి కార్యక్రమంను సంప్రదాయబద్ధంగా భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించారు. కాగా కార్తీకమాస ప్రాశస్త్యాన్ని దేవస్థానం వేద పండితులు మల్లూరి రవికుమార్ శర్మ వివరించారు.


గోదావరికి నదీ హారతి సమర్పణ

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో
జిల్లా జట్టుకు ప్రథమ బహుమతి


ప్రథమ బహుమతిని అందుకుంటున్న జిల్లా బాలుర జట్టు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా చేగుంటలో ఈనెల 16 నుంచి 18 వరకు జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలలో జిల్లా బాలుర జట్టు ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. రంగారెడ్డి జిల్లా జట్టుపై జరిగిన ఫైనల్ పోటీలో2-0 స్కోరు తేడాతో విజయం సాధించి టైటిల్‌ను దక్కించుకుంది.అంతే కాకుండా జట్టు క్రీడాకారులు రిషి, నవదీప్, సన్నీ, బాలికల జట్టు నుంచి సయ్యద్‌అర్షియా త్వరలో జరగనున్న జాతజీయ పోటీలకు సైతం ఎంపికయ్యారు. అ సందర్భంగా రాష్ట్ర పోటీలలో విజయం సాధించిన జిల్లా క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహామూర్తి, డీవైఎస్‌వో సునిల్ రెడ్డి తదితరులు అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య


సాగరిక(ఫైల్)

అశ్వాపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం అశ్వాపల్లి మండలంలో జరిగింది. అశ్వాపల్లి మండలం, మర్కోడు గ్రామానికి చెందిన జల్లారపు సాగరిక(26)కు 11 ఏళ్ల క్రితం లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి గ్రామానికి చెందిన రంజిత్‌తో వివాహం జరిగింది. బతుకుదేరువు కోసం ఇరువురు మర్కోడులోనే నివసిస్తున్నారు. రంజిత్ కూలీపనులకు వెళ్లగా, సాగరిక కూలీపనులతో పాటు బట్టలు కుడుతూ జీవనం సాగిస్తున్నారు. కొద్ది రోజులుగా ఆమె కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్టు చూట్టుపక్కలవారు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం భర్త పనికి వెళ్లగా, పిల్లలు బడికి వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఉన్న గేదెలు వదలకపోవడంతో అది తెలుసుకొని భర్త రంజిత్ మరల ఇంటికి తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో ఇంటి తలుపులు తీసే ప్రయత్నం చేయగా, రాకపోవడంతో కిటికి ద్వారా చూడగా ఆత్మహత్య చేసుకుంది. ఈవిషయాన్ని చుట్టుపక్కల వారికి చెప్పాడు. అశ్వాపల్లి ఎస్ఐ రతీష్ కేసు నమోదు చేసి, ఆత్మహత్యకు గల పూర్తి వివరాలపై దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లెందు తరలించారు.

మధిరలో రైలు కిందపడి వ్యక్తి...

మధిర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మధిర - మోటమర్రి రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం ఉదయం దిగువ లైన్‌పై వెళ్తున్న గూడ్స్ రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిలోమీటర్ 528/12-14 వద్ద దిగువ లైన్‌పై వెళ్తున్న డీఎన్‌కేఐ గూడ్స్ రైలు కిందపడి ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం వీరులపాడు గ్రామానికి చెందిన కొత్త శ్రీనివాసరావు(60) ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈమేరకు రైల్వే ఎస్ఐ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో రైల్వే మధిర అవుట్‌పోస్టు ఇన్‌చార్జి ఎస్. వేణుగోపాలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనలో పలువురిపై కేసు నమోదు

బూర్గంపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారుల విధులకు అటంకం కలిగించి వారిపై దాడికి పాల్పడిన ఘటనపై సోమవారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక వద్ద గోదావరి నుంచి ట్రాక్టర్లు ద్వారా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో ఈ నెల 16వ తేదీ రాత్రి సమయంలో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో ర్యాంపు వద్ద ఉన్న ఇసుక అక్రమ రవాణాదారులు, ముఠా సభ్యులు, డ్రైవర్లు పరారైనట్లు తెలిపారు. వారిని పట్టుకునేందుకు ముందుకు వెళ్తున్న క్రమంలో సారపాక భాస్కర్‌నగర్‌కు చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి ఆర్ఐ ముత్తయ్యపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. దీంతో అప్రమత్తమైన రెవెన్యూ సిబ్బంది అతడిని పట్టుకుని ఆదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సోమవారం ఆర్ఐ ముత్తయ్యపై దాడికి యత్నించిన ఇసుక అక్రమ రవాణాదారులు, ముఠా సభ్యులు(సుమారు 45మంది)ను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆర్ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ఖమ్మంక్రైం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తి బంగారు గొలుసు చోరీ చేసిన సంఘటన సోమవారం ఉదయం ఖమ్మం నగర పరిధిలో జరిగింది. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం.. నగర పరిధిలోని జయనగర్‌కాలనీ రోడ్డునెంబరు 18లో నివాసం ఉంటున్న వరదబోయిన మల్లిక అనేమహిళ తన ఇంటిముందు సోమవారం ఉదయం ఊడుస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి నడుచుకుంటూ వచ్చి మహిళ మెడలోని సుమారు నాలుగుతులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. మహిళ కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చేసరికి అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో స్థానికులు ఖానాపురంహవేలి పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ భానుప్రకాష్ సంఘటన స్థలం వద్దకు చేరకుని వివరాలు సేకరించారు. అనంతరం సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈఘటనపై బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

'కేజ్ కల్చర్' ఖల్లాస్..

» లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం » తొమ్మిది యూనిట్లకు ఐదు కనుమరుగు
» కరువైన అధికారుల పర్యవేక్షణ » నిర్వహణ భారంతో యూనిట్లను తొలగించిన మత్స్యకారులు


పాలేరు జలాశయంలో ఏర్పాటుచేసిన కేజ్‌కల్చర్

కూసుమంచి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం మత్స్య పరిశ్రమను ప్రోత్సహించి, మత్స్యకారులను ఆర్థిక చేయూత అందించాలనే సంకల్పంతో, ఆధునిక, సాంకేతిక ఆధారంగా ఏర్పాటు చేసిన కేజ్‌కల్చర్ కనుమరుగవుతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనూ, లబ్ధిదారులకు యూనిట్ నిర్వహణ ఆర్థికంగా భారంగానూ మారడంతో ఈపరిస్థితి నెలకొంది. 2015లో ఒక్క యూనిట్‌ను మోడల్‌గా ఏర్పాటు చేయగా సక్సెస్ కావడంతో, మొత్తం 9యూనిట్లను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం మూడు, నాలుగు యూనిట్లకే పరిమితం అవగా, మరికొన్ని రోజుల్లో అవికూడా కనుమరుగయ్యే అవకాశం కనిపిస్తోంది.

మత్స్యకారుల ఆదాయం పెంచేందుకు..

జలాశయాల్లో పంజరం వంటివి ఏర్పాటు చేసి వాటిలో చేపలను పెంచే విధానాన్ని కేజ్ కల్చర్‌గా పేర్కొంటారు. వీటిలో చేపలు అధిక దిగుబడులతో పాటు, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఈవిధానం జార్ఖండ్ రాష్ట్రంలో మంచి సక్సెస్ అయింది. దీంతో అప్పటి తెలంగాణ ప్రభుత్వం మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని సంకల్పించింది. అనుకున్నదే తడవుగా కొందరు ఉన్నతాధికారులను, మత్స్యకారులను జార్ఖండ్ రాష్ట్రం పంపించి అధ్యయనం చేసింది. రాష్ట్రంలోని ఎంపిక చేసిన పలు జలాశయాల్లో కేజ్ కల్చర్ యూనిట్లను నెలకొల్పింది. మత్స్య శాఖ ద్వారా పదిమంది మత్స్యకారులకు ఎంపిక చేసి, యూనిట్‌కు రూ.30లక్షల ఖర్చుతో 80శాతం సబ్సిడీగా రూ.24 లక్షలు, మిగిలిన 20శాతం రూ.6లక్షలు లబ్ధిదారుల వాటాధనంతో యూనిట్ ఏర్పాటు చేశారు. 2015లో మొదట ఒక యూనిట్ చేయగా, సక్సెస్ కావడంతో మొత్తం 9యూనిట్లు ఏర్పాటు చేసింది. ఫంగాషయాసిస్, తిలాపియా రకానికి చెందిన చేపలను ఇక్కడ అభివృద్ధి చేశారు. మొదటి ఏడాది ప్రభుత్వం సబ్సిడీ అందించగా, రెండో ఏడాది నుంచి లబ్ధిదారులు సొంతంగా నిర్వహించుకున్నారు.

కనుమరుగవుతున్న కేజ్‌కల్చర్ యూనిట్లు

పాలేరు జలాశయంలో ఏర్పాటు చేసిన కేజ్‌కల్చర్ యూనిట్లు కనుమరుగవుతున్నాయి. 2015లో ఏర్పాటు చేయగా, మొదటి ఐదేళ్లు మంచిగానే నడిచాయి. ప్రతికేజ్‌లోనూ 4టన్నులు తగ్గకుండా చేపలు ఉత్పత్తి అవడంతో మత్స్యకారులు కొంత ఆర్థికంగా సంపాదించుకున్నారు. తర్వాత నిర్వహణ భారంతో కేజ్‌ను తొలగిస్తున్నారు. చేపల దాణాకు రేటు పెరగడం, మార్కెటింగ్ చేసుకోలేకపోవడం, మత్స్యకారుల్లో ఐక్యత దెబ్బతిని పట్టించుకోకపోవడం, నీటిలో నిల్వ ఉండటం వలన కేజ్‌కల్చర్ పైపులు తుప్పు పట్టిపోవడం, వలలు చీకుడుపట్టి తెగిపోవడం వంటి కారణాలతో కనుమరుగవుతున్నాయి. మత్స్యకారులు సైతం వచ్చిన ఆదాయాన్ని వినియోగించుకోవడమే తప్ప. యూనిట్లును తిరిగి అభివృద్ధి చేసుకోకపోవడం కారణంగా ఉంది. మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కూడా కారణంగా చెప్పవచ్చు. ప్రభుత్వం సబ్సిడీపై అందించిన యూనిట్లను తొలగించి అమ్ముకుంటున్నా.. పట్టించుకోలేదనే ఆరోపణలు న్నాయి. ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతికోసం ఏర్పాటుచేసిన పథకం మూడురోజుల ముచ్చటగా మారి కనుమరుగుకావడం కావడంపట్ల విమర్శలకు దారితీసింది. ఇప్పటికైన ప్రభుత్వం ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సి ఉంది.

ప్రభుత్వం సాయం అందించాలి

● ఉప్పయ్య, మత్స్యకారుడు, పాలేరు



కేజ్ విధానంలో చేపలు పెంచడం కొంత ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం చేప మేతకు ఎక్కువ ఖర్చు అవుతోంది. అదే విధంగా వలలు కూడా కొనలేక పోతున్నాం. ఫంగాషియాసిస్ రకం చేపలకు ఖర్చు ఎక్కువ అవడంతో కేవలం తిలాపియా రకం చేపలను మాత్రమే పెంచుతున్నాం. అదే విధంగా కొత్తగా మరికొన్ని కేజ్‌యూనిట్లు ప్రభుత్వం మంజూరు చేయాలి.

మద్దతు ధర అడిగినందుకు రైతుపై వ్యాపారి దాడి

● సుజాతనగర్‌లో ఘటన

సుజాతనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ మండలంలోని ఓ ప్రయివేట్ పత్తి కొనుగోలు కేంద్రంలో రైతుపై ప్రయివేట్ పత్తి బయ్యర్ చేయి చేసుకున్నాడు. ఈ సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల ప్రకారం.. సుజాతనగర్ మండలం సర్వారం పంచాయతీ గుడితండా గ్రామానికి చెందిన రైతు నగేష్ తన చేలో పండిన పత్తిని ఆటోలో ఎగుమతి చేయించి తన తరువాత వస్తాను అంటూ తన అమ్మను తోడు ఇచ్చి సుజాతనగర్‌కు పంపించాడు. సీసీఐకి పోయే క్రమంలో మార్గ మధ్యలో ఓ ప్రయివేట్ పత్తి కొనుగోలు బయ్యర్ ఆపి ధర విషయంలో బేరసారాలు గావించాడు. చివరగా ఆ బయ్యర్ రూ.5,550 ఇస్తానని చెప్పి వాళ్ల అమ్మ వద్దు అంటున్నా బలవంతంగా దిగుమతి చేయించుకున్నాడు. ఆ వెనుకనే వస్తున్న తన కుమారుడు అక్కడికి రాగానే జరిగిన విషయం తన తల్లి అతనికి వివరించగా మా పత్తి మేము తీసుకుంటామని, సీసీఐకి తీసుకెళ్తామని, లేదంటే మద్దతు ధర అన్నా ఇవ్వాలని బయ్యర్‌ని అడగగా బయ్యర్ కోపంతో రైతుపై నానా దుర్భాషలాడి, చేయి చేసుకున్నాడని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

రోడ్డు ప్రమాదంలో వలస కూలీకి గాయాలు

జూలూరుపాడు, నవంబరు18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వలస కూలీకు గాయాలైన సంఘటన సోమవారం జూలూరుపాడులోని పాపకొల్లు క్రాస్ రోడ్డు వద్ద చోటుచేసుకుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మోడెం మనోజ్ మిర్చి కోతల పనులు చేపట్టేందుకు జూలూరుపాడు మండలంలోని అనంతారం గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై రహదారి దాటుతుండగా పాపకొల్లు క్రాస్ రోడ్డు వద్ద కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో వలస కూలీకి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రు డిని కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు.

నారవేప కలప నరికివేతపై విచారణ


అటవీ సిబ్బంది స్వాధీనం చేసుకున్న నారవేప కలప

జూలూరుపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జూలూరుపాడు రేంజ్ పరిదిలోని పాపకొల్లు అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు నారవేప కలపను నరికిన సంఘటనపై విచారణ నిర్వహిస్తున్నట్లు ఎఫ్ఆర్వో ప్రసాదరావు తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పాపకొల్లు బీట్‌లోని రాసగానిగుట్ట ప్రాంతంలో తమ సిబ్బంది మల్లయ్య విజయలక్ష్మి, చింతా వెంకటేశ్వర్లు కలసి ఆదివారం పెట్రోలింగ్ చేస్తున్నారని, ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు కోత మిషన్‌తో చెట్టును కోస్తున్న శబ్దం రావడంతో సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. వారు పారిపోతుండగా తమ సిబ్బంది వెంబడించినప్పటికీ దొరకలేదని తెలిపారు. నారవేప వృక్షాన్ని వారు నరికినట్లు తెలిపారు. నరికిన కలపను స్వాధీనం చేసుకున్నామని దాని విలువ రూ.40 వేలు ఉంటుందన్నారు. నరికిన వారిని గుర్తించేందుకు విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో కార్యాలయానికి తరలిస్తామన్నారు.

గుండెపోటుతో నాలుగేళ్ల చిన్నారి మృతి


ప్రహర్షిక(ఫైల్)

ఖమ్మం రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో నాలుగేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన సోమవారం ఖమ్మం జిల్లా రూరల్ మండలం ఎమ్ వెంకటాయపాలెంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమ్ వెంకటాయపాలెం గ్రామానికి చెందిన సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ నాయకుడు కుర్రా వెంకన్న కుమారుడు కుర్రా వినోద్, లావణ్య దంపతుల కూతురు ప్రహర్షిక(4) సాయంత్రం వేళ్ల ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ఒక్కసారిగా చాతిలో నొప్పి అంటూ కుప్పకూలి పోయింది. కుటుంబ సభ్యులు వెంటనే చిన్నారిని ఖమ్మం ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిపారు. అల్లారుముద్దుగా చూసుకుంటు న్న ఒక్కగానొక్క కూతురు కళ్ల ముందే మృతిచెందడంతో తల్లి, దండ్రుల శోకసంద్రంలో మునిగిపోయారు. చిన్నారి మృతదేహాన్ని చూసేందుకు గ్రామస్థులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య, బి.వెంకయ్య, యాదగిరి, పుల్లయ్య సత్యం, రాందాసు తదితరులు చిన్నారి మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు.

సర్వేపై ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడి ప్రచారం


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు సుధాకర్

కల్లూరు, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు దంతాల సుధాకర్ ఇంటింటి సర్వేపై తన దైన శైలిలో ప్రచారం చేస్తున్నాడు. సోమవారం మండలంలోని కల్లూరు, లింగాల, చెన్నూరు తదితర గ్రామాల్లో ప్రచార కార్యక్రమాన్ని బైక్‌పై చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వేపై ప్రజల్లో నెలకొన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేసే ప్రకియలో భాగంగా ఈ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఆయన చెప్పారు. ఇది కుల సర్వే కాదని, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ, కుల సర్వే" సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే" అని, ప్రజలు నిస్సందేహంగా నిర్భయంగా ఈ సర్వేకు వచ్చిన ఎన్యుమరేటర్లకు వివరాలు అందించాలని ప్రజలను కోరారు. నిస్సందేహాలు కలిగినచో మండల అధికారులను సంప్రందించాలని కోరారు. ఇలా ఈ సర్వేపై ప్రజలకు అవగహన కల్పించడం జరగుతుందని సుధాకర్ తెలిపారు.



27,28 తేదీల్లో ఖమ్మంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశాలు

ఖమ్మంటౌన్, నవంబర్ 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 27, 28 తేదీల్లో సీపీఎం జిల్లా కమిటీ సమావేశాలను జిల్లా సీపీఎం కార్యాలయం సుందరయ్య భవన్‌లో నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా మహాసభలను వచ్చేనెల 18,19 తేదీల్లో సత్తుపల్లిలో నిర్వహిస్తామన్నారు. ఖమ్మంలో నిర్వహించే జిల్లా కార్యదర్శివర్గం, జిల్లా కమిటీ సమావేశాలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎస్. వీరయ్య. పోతినేని సుదర్శన్‌రావు హాజరవుతారన్నారు. వచ్చేనెల 18,19 తేదీల్లో సత్తుపల్లిలో నిర్వహించే జిల్లా మహాసభల్లో సీపీఎం నిర్వహించిన పోరాటాలు, రాబోయే మూడేళ్లలో పార్టీ బలోపేతానికి చేపట్టవలసిన చర్యలపై కార్యాచరణ రూపొందిస్తారని నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు.

యథేచ్ఛగా ఇసుక దందా..

అర్ధరాత్రి ట్రాక్టర్లలో ఇసుక రవాణా
పట్టించుకోని అధికారులు



ఆకేరు నది నుంచి ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలిస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధప్రాంతాలనుంచి యథేచ్ఛగా అర్ధరాత్రి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్నారు అక్రమ వ్యాపారులు. ఇటీవల కురిసన భారీవర్షాలతో మండలంలోని ఆకేరు, పాలేరు పరివాహక ప్రాంతానికి భారీ ఎత్తున ఇసుక మేటలు వేసింది. దీనిపై కన్నేసిని ఇసుక వ్యాపారులు రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక తరలిస్తున్నారు. లక్షలాదిరూపాయలు కొల్లగొడుతున్నారు. సోలీపురం, ముజాహిద్‌పురం, ఉర్లుగొండ, ఆకేరు నదినుంచి పడమటితండా, రాకాసితండా, రావిచెట్టుతండా, పిండిప్రోలు, ములకలపల్లి ప్రాంతాలనుంచి ఇసుకను తరలిస్తున్నారు. మండలంలో వాల్టా చట్టం అమల్లో ఉన్నా, ఎలాంటి అనుమతి లేకుండా, ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఇసుకవ్యాపారుల దందాతో ఆకేరు, మున్నేరు నదిలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నారు.

వసూల్‌రాజాలు

అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రైవేటు వ్యక్తులు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లనుంచి ఆయా గ్రామాల్లో వసూలుకు పాలపడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఒక్కో ట్రాక్టర్‌నుంచి రూ.200 నుంచి 500వరకు వసూలు చేస్తున్నట్లుసమాచారం.

నిద్రపోతున్న నిఘా

ఇసుక అక్రమరవాణ జరుగుతున్నా అరికట్టేందుకు వివిధశాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో నిఘా వ్యవస్థపూర్తిగా విఫలమైంది. అటు రెవెన్యూ, మైనిగ్, పోలీసు అధికారులు ఇసుక అక్రమ రవాణాను మామూలుగా తీసుకోవడంతో ఇసుక వ్యాపారం దర్జాగా ఖమ్మం తరిస్తూ ట్రాక్టర్‌కు రూ.6నుంచి 7వేల వంతున విక్రయిస్తూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు.

కేఎంసీ ఎదుట కోనోకార్పస్ చెట్ల తొలగింపు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోనోకార్పస్ చెట్ల తొలగింపు అనంతరం కేఎంసీ

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట వేపుగా పెరిగిన కోనోకార్పస్ వృక్షాలపై వేటు పడింది. పర్యావరణానికి హాని తలపెట్టే కోనోకార్పస్ వృక్షాలపై శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'నగరమంత నరికారు.. కార్యాలయం ఎదుట ఉంచారు'.. కథనంపై మేయర్ పునుకొల్లు నీరజ స్పందించారు. కేఎంసీ ఉద్యోగులు, ప్రజల అనారోగ్యానికి కారణమయ్యే కొనోకార్పస్ చేట్లను తొలగించాలని కేఎంసీ ఉద్యానవన అధికారి బెల్లం రాధికను ఆదేశించారు. దీంతో సోమవారం డీఆర్ఎఫ్ బృందాలు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం ముందు ఉన్న కోనోకార్పస్‌పై వేటు వేశాయి. వాటి స్థానంలో అందమైన ప్రకృతికి హితమైన మొక్కలను నాటుతామని అధికారులు తెలిపారు. కొనోకార్పస్ మొక్కలు తొలగింపుతో కేఎంసీ ఉద్యోగులు ఊపిరిపీల్చుకున్నారు.

వరదలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఖమ్మం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన అకాల వర్షాలకు వచ్చిన వరదలలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏదులాపురం సమకార సంఘం చైర్మన్ జర్పుల లక్ష్మణ్ నాయక్ కలెక్టర్ ముజిమిల్‌ఖాన్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతు వరదలకు పంటలు పూర్తిగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు
(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	40రూ.
వంకాయ	48
గుత్తి వంకాయ	50
బీరకాయ	54
పచ్చిమిర్చి	34
కాకరకాయ	28
బెండకాయ	20
పొట్లకాయ	44
దోసకాయ	38-58
నాటుచిక్కుడు	120
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	38
దొండ	44-50
సొరకాయ	20
క్యారెట్	84
క్యాప్సికం	68
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	170
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	అపుడో ఇప్పుడో ఎపుడో
ఆదిత్య:	క
తిరుమల:	దేవర
సినీ గెలాక్సీ:	ధూంధాం

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

తిరుమలాయపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎటువంటి షరతులు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఇవ్వాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. సోమవారం తిరుమలాయపాలెంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వం రైతులకు అనేక వరాలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందన్నారు. రైతులకు ఎటువంటి షరతులు లేకుండా పంటరుణాలు పూర్తిస్థాయిలో మాఫీచేయాలన్నారు. అలాగే మూసీ నదీ ప్రక్షాళన పేరుతో పేద ప్రజల ఇళ్లను కూల్చడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి ఎం.రాజేంద్రప్రసాద్, జి.రమేష్, వైప్రకాష్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించాలి



రైతులతో మాట్లాడుతున్న సివిల్ సప్లయీస్ డీఎం శ్రీలత

నేలకొండపల్లి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లల్లో రైతులను ఏమాత్రం ఇబ్బందులు పెట్టినా సహించేది లేదని సివిల్ సప్లయీస్ డీఎం శ్రీలత అన్నారు. సోమవారం పైనంపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడారు. కొనుగోళ్లు సక్రమంగా జరుపుతున్నారా? కొనుగోళ్లలో ఏమైనా ఇబ్బందులు వస్తున్నాయా? కాంటాలు సరిగ్గా ఉన్నాయా? అంటూ రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం మొత్తం తిరిగారు. అనంతరం డీఎం మాట్లాడుతూధాన్యం కొనుగోలు జరిపిన 48గంటల్లో డబ్బులు పడతాయన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చి మద్దతుధరను పొందాలన్నారు. సివిల్ సప్లయీస్ ఆర్ఐ నరేష్, ఏఈఓ భవాని, సీఈఓ వరగాని జగదీష్ డీఎం వెంట ఉన్నారు.

గ్రూప్-4లో మెరిసిన అన్నదమ్ములు

ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూనే మరోసారి గ్రూప్ 4కు ఎంపిక



గ్రూప్-4 సాధించిన లెనిన్, మనోజ్

ఖమ్మంరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండగానే మరోసారి ప్రభుత్వ ఉద్యోగం సాధించారు ఇద్దరు అన్నదమ్ములు.. ఖమ్మంరూరల్ మండలం, గోళ్లపాడు గ్రామానికి చెందిన గీతా కార్మికుడు గడ్డమీది వెంకటేశ్వర్లు, వెంకట్రావమ్మ దంపతుల కుమారులు లెనిన్ కుమార్, మనోజ్ కుమార్‌లు ఇద్దరు చిన్ననాటి నుంచి విద్యలో ప్రతిభ కనబరుస్తు వస్తున్నారు. ఈ అన్నదమ్ములు ఇద్దరు ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు. లెనిన్ కుమార్ కేరళాలో బీఎస్ఎన్ఎల్‌లో జేటీఓగా, మనోజ్ కుమార్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో బీట్ ఆఫీసర్‌గా ఖమ్మం జిల్లా కారేపల్లి లో పనిచేస్తున్నారు. వీరు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తుండగానే గ్రూప్-4 ఫలితాలలో రెండోసారి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. లెనిన్ కుమార్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ జూనియర్ అకౌంటెంట్‌గా, మనోజ్ కుమార్ రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగాలను సాధించారు. అన్నదమ్ములు ఇద్దరు ఉద్యోగాలు చేస్తుండగానే మరో సారి గ్రూప్-4లో ఇరువురు అన్నదమ్ములు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్థులు వారిని అభినందిస్తున్నారు.

హార్వెస్ట్, రెజోనెన్స్ విద్యార్థుల వనవిహారం



విద్యార్థులతో మాట్లాడుతున్న హార్వెస్ట్ కరస్పాండెంట్



చిన్నారులతో రెజోనెన్స్ పాఠశాల యాజమాన్యం

ఖమ్మం,ఖానాపురంహవేలి నవంబరు 18(ఆంధ్రజ్యోతి): .నగరంలోని హార్వెస్ట్ ప్రైమరీ విద్యార్థులను సోమవారం నగరంలోని కొదుమూరులోని మామిడితోటకు వనవిహారానికి తీసుకెళ్లినట్లు పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన 300ల మంది విద్యార్థులను వనవిహర యాత్రకు తీసుకెళ్లినట్లు తెలిపారు. వివిధ రకాలు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు మ్యాజిక్ షో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో విద్యార్థులు గడిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ ప్రధానోపాధ్యాయురాలు మానస, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

రెజోనెన్స్ శ్రీనగర్‌కాలనీ విద్యార్థులు..

నగరంలోని శ్రీనగనర్ రెజోనెన్స్ పాఠశాల విద్యార్థులను కార్తీక మాసం సందర్భంగా సోమవారం వనవిహార యాత్రకు తీసుకెళ్లినట్లు పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణిలు తెలిపారు. నగరంలోని చెరుకూరి గార్డెన్స్‌లో విహారయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో బాగంగా సోమవారం నగరంలోని జిల్లా గ్రంథాలయంలో పాఠశాల, కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.పట్టణీకరణ వల్ల జరుగుతున్న కాలుష్యం పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్ఏసీలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో డిసెంబరు 4న 3, 6, 9 తరగతి విద్యార్థులకు నిర్వహించేనేషనల్ అచామ్మెంట్ సర్వే పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి కె రవికుమార్ అన్నారు. సోమవారం నగరంలోని పలు పాఠశాలలను సందర్శించారు. ఎన్ఏసీ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని సంబంధిత ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఫలితాల్లో ఖమ్మం జిల్లాను ముందుంచాలని కోరారు. అనంతరం పదోతరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడి మంచి గ్రేడ్ పాయింట్లు సాధించుటకు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

కాల్ సెంటర్ ఫిర్యాదులను డిజిటలైజ్ చేయాలి

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ కలెక్టరేట్ కాల్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కాల్ సెంటర్ లో నమోదైన ఫిర్యాదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో కొనసాగుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే, ధాన్యం కొనుగోలు, పత్తి కొనుగోలులో ప్రజలకు, రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నెంబర్ 1077 కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని, ఆ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 1077 కు వచ్చే ప్రతి ఫిర్యాదులను డిజిటలైజేషన్ చేసి ప్రతి రోజు నివేదిక అదనపు కలెక్టర్‌కు అందించాలని కలెక్టర్ తెలిపారు.

కాల్ సెంటర్ కు వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారం లభించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలలో కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, కాల్ సెంటర్ ఇన్‌చార్జ్ రజిత తదితరులు ఉన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై అవగాహన సదస్సు

ఖమ్మం లీగల్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై న్యాయచైతన్య అవగాహన సదస్సును సోమవారం జిల్లా న్యాయసేవాసంస్థ కార్యాలయంలో ఖమ్మం జిల్లా న్యాయసేవాసంస్థ కార్యదర్శి కె.చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా పారా లీగల్ వాలంటీర్ల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం, చట్టాలపై అవగాహనను కల్పించారు. పేదలకు, మహిళలకు, దివ్యాంగులకు జిల్లా న్యాయసేవాసంస్థ రాష్ట్ర న్యాయసేవా సంస్థ, కేంద్ర న్యాయసేవాసంస్థ అందించే సేవల గురించి వివరించారు. అలాగే లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తరుపున డిఫ్యూటి చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మల్లెబోయిన వలరాజు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి, డ్రగ్స్, మద్యపానం మొదలగు మత్తు వ్యసనాలపై మహిళలు, బాలికలపై జరుగుతున్న అగాయిత్యాలు, అత్యాచారాలపై గ్రామాల్లో, పట్టణాల్లో సదస్సులు నిర్వహించి వారిలో అవగాహనా చైతన్యాన్ని కల్పించాలని లీగల్ వలంటీర్లకు తెలిపారు. అలాగే పారా లీగల్ వలంటీర్లకు జిల్లా న్యాయసేవాసంస్థ కార్యదర్శి కె.చంద్రశేఖరరావు గుర్తిం పు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పారాలీగల్ వలంటీర్లు, న్యాయసేవా సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారులే కల్లాలు



రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

కూసుమంచి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఆయకట్టు, బోర్లు, బావుల కింద ఆశించినస్థాయిలో పంట దిగుబడులు రావడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తుండగా.. మరోవైపు ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి కల్లాలు లేక అవస్థలు పడుతున్నారు. దీంతో ధాన్యం రహదారులపై ఆరబోస్తున్నారు. కూసుమంచి మండలంలోని పెరికశింగారం, జక్కేపల్లి, గట్టుసింగారం, మల్లేపల్లి, గోరీలపాడుతండ, గ్రామాల్లో దారిపొడవునా ధాన్యాన్ని రైతులు ఆరబెడుతున్నారు. ఈగ్రామాల్లో రహదారిపై నిత్యం వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. రాత్రి వేళల్లో వాహనాలు ధాన్యం కుప్పలపై దూసుకెళ్లిప్రయాణికులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలున్నాయి.

అవగాహన కల్పిస్తాం:: ఎస్ఐ

ప్రధాన రహదారుల పక్కన ధాన్యాన్ని ఆరబోయొద్దు రోడ్డుపై ధాన్యం ఆరబోయడంతో వామనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈవిషయంలో రైతులను అవగాహన కల్పిస్తాం. రైతులు వ్యవసాయక్షేత్రాల్లోనే కల్లాలను ఏర్పాటుచేసుకుంటే మంచిది. లేదా కొనుగోలు కేంద్రాలకు నేరుగా తరలించుకోవాలి.

రేపటినుంచి జర్నలిస్టులకు హౌజింగ్ సొసైటి సభ్యత్వం



మాట్లాడుతున్న స్తంభాద్రి జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు సైదులు

ఖమ్మంటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇళ్లస్థలాల కోసం దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న జర్నలిస్టులకు హౌజింగ్ సొసైటీ సభ్యత్వాలు ఇవ్వనున్నట్లు స్తంభాద్రి జర్నలిస్టు మ్యూచువల్లీ ఎయిడెడ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు తెలిపారు. సోమవారం సొసైటీ సర్వసభ్య సమావేశం నగరంలోని జడ్పీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు మాట్లాడుతూ జర్నలిస్టులకు హౌజింగ్ సొసైటీ సభ్యత్వాలను ఈ నెల 20నుంచి సీనియారిటీ ప్రాధాన్యత క్రమంలో ఇస్తామన్నారు. ఖమ్మం జర్నలిస్టులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఇంటిస్థలాల కల నెరవేర్చేందుకు సొసైటీ మరో ముందడు గు వేసిందన్నారు. ఇప్పటికే స్వీకరించిన దరఖాస్తులను సీనియారిటీ ప్రాధాన్యత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులకు సముచిత స్థానం కల్పిస్తూ స్క్రూటినీ ప్రకియ చేపడతామన్నారు. నూతనంగా ఎన్నుకున్న సొసైటీ సభ్యులకు అధికారుల ఆమోదముద్ర లభించగానే ప్రభు త్వం నుంచి భూమి స్వాధీనంతో పాటు అవసరమైన సొమ్ముల జమ ప్రక్రియ అతి త్వరలోనే చేపట్టడం జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు సైదులు తెలిపారు.

ఖాళీగా ఉన్న పదవుల ఎన్నిక

కొంతకాలంగా సొసైటీలో ఖాళీగా ఉన్న పదవులను ఈ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీ కార్యదర్శిగా బొల్లం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా షైసా పాపారావు, కోశాధికారిగా వెన్నబోయిన సాంబశివరావును ఎన్నుకోవటంతో సొసైటీ పూర్తిస్థాయి కార్యవర్గం ఏర్పడింది. సమావేశంలో సొసైటీ డైరెక్టర్‌లు ఏనుగు వెంకటేశ్వరరావు, సయ్యద్ ఖదీర్, బొల్లం శ్రీనివాస్, షైసా పాపారావు, వెన్నబోయిన సాంబశివరావు, ఆలస్యం అప్పారావు, పీవీ. సత్యనారాయణ, బత్తుల వాసు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఎక్సైజ్ వాహనాల వేలం

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని రెండో ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలోని పలు కేసుల్లో స్వాదీనం చేసుకున్న వాహనాలను బుధవారం వేలం ద్వారా విక్రయాలు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో సోమవారం ప్రకటించారు. వేలంలో పాల్గొనే వారు ఖమ్మంలోని టీడీపీ కార్యాలయం సమీపంలోని ఎక్సైజ్ 1 టౌన్ పోలీసుస్టేషన్ వెనుకబాగంలోని కార్యాలయానికి రావాలని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారస్సుతో మంజూరు చేయించిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారం 25వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు వడ్డెబోయిన నర్సింహారావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దాసరి పూర్ణ, నాగశెట్టి రాధాకృష్ణ, నాగభూషణం, ఖాజా, కందికొండ శ్రీను, వీరన్న పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

ప్రజావాణిలో వినతులు స్వీకరించిన కలెక్టర్, అదనపు కలెక్టర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్ నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజలు అందించిన దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డాక్టర్ శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠలతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, డిఆర్డీవో ఎస్. సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● బోనకల్ మండలం మోటమర్రి గ్రామానికి చెందిన మరీదు వెంకన్న తనది నిరుపేద కుటుంబమని పాప చదువుకు ఆర్థిక భారం అవ్వకుండా మహాత్మ జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆరో తరగతిలో సీట్ ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు.

● నేలకొండపల్లి మండలం చెరువుమాధారం గ్రామానికి చెందిన ఎస్.కే. పాషా తాను ఎంఎల్‌టీ డిప్లొమా ఇన్ మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ చదువుకున్నానని, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నందున తనకు ఉద్యోగం ఇప్పించాలని కలెక్టర్‌ను కోరాడు.

ఉన్నతస్థాయి అధికారులు గైర్హాజరు

ఖమ్మం సంక్షేమ విభాగం, (ఆంధ్రజ్యోతి): కిందిస్థాయిలోని అధికారులు, ఉద్యోగులు ప్రజల సమస్యలు పరిష్కారం చూపకుంటే ఉన్నతస్థాయి అధికారులను కలిసి సమస్యలు పరిష్కారం చేయించుకునేందుకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయితే ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఉన్నత స్థాయి అధికారులు గైర్హాజరయ్యారు. అసిస్టెంట్ కమిషనర్‌తో పాటుగా టౌన్ ప్లానింగ్, ఎకౌంట్స్, రెవెన్యూ, ఇంజనీరింగ్, జనన, మరణాలు, మెప్మా విభాగాల అధికారులు హాజరైనారు. మధ్యాహ్నం వరకు వేసి చూసిన ఫిర్యాదుదారులు గతంలో పనిచేయని అధికారులకే మరో సారి వినతిపత్రాలను అందించారు. అక్రమ కట్టడాలు, అక్రమణలకు సంబంధించిన ఫిర్యాదుదారులువినతులు ఇవ్వకుండానే వెనుదిరిగారు.



బీసీ రిజర్వేషన్‌పై వినతులు, అభ్యంతరాల స్వీకరణ

ఎర్రుపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు బీసీ రిజర్వేషన్ పై సలహాలు, సూచనలు వినతులు అభ్యంతరాలను తెలపాలని తహసీల్దార్ మన్నె ఉషాశారద సోమవారం ఒక ప్రకనలో తెలిపారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 19న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలిరి సురేందర్, బాలలక్ష్మి దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. బీసీ రిజర్వేషన్ అమలు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి, రిజర్వేషన్ ఆవశ్యకత తదితర అంశాలపై అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలిపే అవకాశం ఉందని, ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు.

ధాన్యం గింజ కొలతల ఆంక్షలను ఎత్తివేయాలి

» రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

వైరా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధాన్యం గింజ కొలతలు వేయాలనే ఆంక్షలు ప్రభుత్వ మూర్ఖత్వానికి నిదర్శనమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. సోమవారం వైరాలో జరిగిన స్టడీ సర్కిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఈ నిబంధనను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సన్నరకాల ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిబంధనలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం 32రకాల ధాన్యాన్ని సన్నరకాల ధాన్యంగా గుర్తించి బోనస్ ఇస్తామని ప్రకటించి ఇదే సమయంలో ధాన్యం గింజ పొడవు, వెడల్పు కొలతల ఆంక్షలు విధించడం సిగ్గుచేటని విమర్శించారు. ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొంతు సమత, నాయకులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, పారుపల్లి కృష్ణారావు, చింతనిప్పు చలపతిరావు, బాణాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మరో వందేళ్లైనా ఎర్రజెండా పార్టీ చెక్కుచెదరదు

» సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి

మధిర, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పేదలు, కార్మిక, కష్టజీవులపార్టీ సీపీఐ అని, మరో వందేళ్లైనా ఎర్రజెండాపార్టీ చెక్కుచెదరని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మడుపల్లిలో జరిగిన సీపీఐ పార్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైనది ఎర్రజెండా పార్టీ అని తెలిపారు. సీపీఐకి వందేళ్ల చరిత్ర ఉందని ఇప్పటికీ చెక్కుచెదరకుండా మనగలుగుతున్నామన్నారు. డిసెంబర్ 26నాటికి వందేళ్లు పూర్తిచేసుకుంటుందని ఈసందర్భాన్ని పురస్కరించుకొని వాడవాడలో ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. అమరవీరులకు నివాళులర్పించాలని సూచించారు. ప్రజల సమస్యలపై నిత్యం పోరాడుతుంటామని పేర్కొన్నారు. అనంతరం పార్టీ సభ్యత్వాలను అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవిబాబు, మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు రహీం, పెరుమాళ్లపల్లి ప్రకాశరావు, పంగ శేషగిరిరావు, శిలువేరు శ్రీనివాసరావు, అన్నవరపు సత్యనారాయణ, రంగు నాగకృష్ణ, పీ. అప్పారావు, జల్లా బ్రహ్మం, కొండ తదితరులుపాల్గొన్నారు.

గన్నీసంచుల కొరత

» అరకొర సరఫరాతో రైతుల అవస్థలు » పలు కేంద్రాల్లో నిలిచిన ధాన్యం కాంటాలు

» ఐకేపీ కేంద్రంలో చిరిగిన సంచులతో రైతుల ఇబ్బందులు



పుల్లయ్యబంజరలో ఐకేపీ కేంద్రంలో చినిగిన సంచుల్లో కాంటా వేసిన దృశ్యం

కల్లూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లోని ప్రాథమిక సహకార సంఘాల పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాల్లో గన్నీ సంచుల కొరత ఏర్పడింది. దీంతో గత నాలుగు రోజుల క్రితం నుంచి ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో రైతుల నుంచి కేంద్రం నిర్వాహకులు కాంటాలు వేయని పరిస్థితి. ఎఫ్‌సీఐ నిబంధనల ప్రకారం తేమ శాతం లేకుండా రైతులు తమ ధాన్యాన్ని కల్లాల వద్ద ఆరబోసినారు. ఆయా సొసైటీల పరిధిలో గల కేంద్రాల్లో తమ ధాన్యాన్ని కాంటాలు వేయిద్దామని రైతులు సిద్ధంగా ఉండగా, గన్నీ సంచుల కొరత తీవ్రంగా వేధిస్తుంది.

మండలంలోని కల్లూరు, కొర్లగూడెం, చెన్నూరు, పోచారం పీఏసీఎస్‌ల పరిధిలో 16 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాని రైతుల నుంచి తగిన డిమాండ్‌కు అనుగుణంగా గన్నీ సంచులు జిల్లా కేంద్రం నుంచి సంబంధిత అధికారుల పంపలేదు. కేంద్రాలు ప్రారంభించిన తరువాత ఇప్పటి వరకు అరకొరగా మాత్రమే గన్నీ సంచులు పంపారని పలు కేంద్రాల పరిధిలో గల రైతులు వాపోతున్నారు.

కల్లూరు పీఏసీఎస్ పరిధిలో గల ఏడు కేంద్రాలకు గాను ఇప్పటి వరకు 15 వేల గన్నీ సంచులు మాత్రమే వచ్చాయి. వాస్తవంగా ఈ సొసైటీ పరిధిలో ఇంకా 60 వేల సంచుల వరకు డిమాండ్ ఉంది. చెన్నూరు పీఏసీఎస్‌లో రెండు కేంద్రాలు ఏర్పాటు కాగా, 42 వేల సంచులు మాత్రమే అందాయి. ఇంకాను ఇక్కడ కొనుగోలు కేంద్రంలో లక్ష వరకు డిమాండ్ ఉంది. కొర్లగూడెం పీఏసీఎస్‌లో నాలుగు కేంద్రాలు ఉండగా, ఇక్కడకు 20 వేల వరకు గన్నీ సంచులు అందాయి. ఇంకాను 40 వేల వరకు సంచుల డిమాండ్ ఉంది. ఇక పోచారం సొసైటీలో 3 కేంద్రాలు ఉండగా, 20 వేల సంచులు మాత్రమే వచ్చాయి. ఇంకా 40 వేల సంచుల డిమాండు ఉంది. ఇలా ఆయా కేంద్రాల్లో సంచుల కొరత కారణంగా రైతులు అరబెట్టి కాంటాల కోసం సిద్ధమవుతున్న తరుణంలో గన్నీ సంచులు లేక నానా అవస్థలు పడుతున్నారు. అసలే వాతవరణం మార్పు రోజు రోజుకు ఎలా ఉంటుందోనని ఈ సీజన్‌లో భయాందోళనకు గురవుతుండగా, మరో వైపున కేంద్రాల్లో గన్నీ సంచుల కొరత కారణంగా కొనుగోలులో తీవ్రమైన జాప్యం జరుగుతుంది.

ఐకేపీ కేంద్రంలో చినిగిన సంచులు....

మండలంలోని పుల్లయ్యబంజరు గ్రామంలోని శివాలయం ప్రాంగణంలో గల ఐకేపీ కొనుగోలు కేంద్రంలో చిరిగిన పాత సంచులు వచ్చాయి. దీంతో కేంద్రం నిర్వాహకులకు కొనుగోలులో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. 20 వేల వ రకు పాత సంచులు చిరిగి ఉండటంతో రైతులు కూడా తమ ధాన్యాన్ని ఆ సంచులో నింపగా కారిపోతున్నాయని వాపోతున్నారు. ఇంకాను 37 వేల బస్తాల వరకు డిమాండు ఉందని తెలిసింది. ఈ కేంద్రంలో కొనుగోలు ప్రక్రియ వేగంగా సాగుతున్న సంచుల కొరత కొనుగోలు ప్రక్రియకు ఆటంకంగా మారింది. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా సాగేలా చూసి, డిమాండ్‌కు తగినట్లుగా గన్నీ సంచులను సత్వరమే అందించాలని రైతులు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి సభ్యత్వమే ప్రామాణికం

» టీడీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు కనగాల సాంబశివరావు, కేతినేని హరీష్‌చంద్ర

తల్లాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమే ప్రామాణికమని టీడీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు కనగాల సాంబశివరావు, కేతినేని హరీష్‌చంద్ర అన్నారు. సోమవారం తల్లాడలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలకు కొండంత అండగా పార్టీ ఉంటుందని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు, పునరుద్ధరణ చేయించుకున్న నాయకులు, కార్యకర్తలకు పార్టీ తరఫున రూ.ఐదులక్షల బీమా సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి వెంకటేశ్వరరావు, సరికొండ శ్రీనివాసరాజు, మొక్కా కృష్ణార్జున్, వెంకటరత్నం, దుగ్గినేని వెంకటేశ్వరరావు, వెంకన్న, పెద్దబ్బాయి, మల్లయ్య, బాబు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి'

తల్లాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రైతుసంఘం జిల్లా నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తల్లాడ మండలం నూతనకల్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతుసంఘం నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో రైతుసంఘం మండల నాయకులు నల్లమోతు మోహన్‌రావు, కల్యాణం కృష్ణయ్య, వీరయ్య, ఐనాల రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

'ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలి'



ఫైనాన్స్ కంపెనీ ముందు ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మధిరటౌన్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రైవే ట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలు అరికట్టాలంటూ సోమవారం మధిరలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ ముందు బాధితురాలితో కలిసి సీపీఎం పార్టీ ఆందోళన నిర్వహించింది. మధిర మం డలం రాయపట్నం గ్రామానికి చెందిన గుగ్గిళ్లపు వెంకటేశ్వర్లుకు హౌసింగ్ లోన్ ఇప్పిస్తామని ఓ ఫైనాన్స్ కంపెనీ ఏజెంట్లు తమ ఇంటి చుట్టూ తిరిగారని ఆయన కుమార్తె రాజేశ్వరి తెలిపారు. తమకు తిరిగి కట్టే స్తోమత లేదని, తన తండ్రి ఆరోగ్యం కూడా బాగోలేదని తెలిపిన లోన్‌కు ఇన్సూరెన్స్ ఉందని ఒకవేళ ఏదైనా అయి చనిపోతే లోన్ కట్టే పనిలేదని చెప్పి లోన్ ఇచ్చారని తెలిపింది. ఇటీవల తమ తండ్రి అనారోగ్యంతో చనిపోతే లోన్ తన తండ్రి పేరు లేదని తన పే రునే ఉందని లోన్ కట్టాలని వేధిస్తున్నారని బాధి తురాలు రాజేశ్వరి వాపోయింది. లోన్ సమయంలో హామీ అని చెప్పి, తనవి తన తండ్రివి ఏవేవో కాగితాలపై సంతకాలు తీసుకున్నారని తాను, తన తండ్రి నిరక్షరాసులమని తమను మో సం చేశారని తమకు న్యాయం చేయాలని కోరింది. ఎంతో మంది అమాయకులను ప్రయివేట్ ఫైనాన్స్ సం స్థలు మోసం చేస్తున్నాయని, ముఖ్యంగా పల్లెల్లో నివసించే వారిని, నిరక్షరాసులను లక్ష్యంగా వీరు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వం ఇటువంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డి మాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధితురాలు రాజేశ్వరితో పాటు సీపీఎం నాయకులు పాపినేని రామనర్సయ్య, శీలం నరసింహరావు, పడకంటి మురళి తదితరలు పాల్గొన్నారు.

సుశీలమ్మకు ఎంపీ నివాళి



సుశీలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

తల్లాడ, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతనకల్ గ్రామంలో ఇటీవల మృతిచెందిన గణేశుల సుశీలమ్మకు ఎంపీ రఘురాంరెడ్డి సోమవారం నివాళులర్పించారు. సుశీలమ్మ కుమారుడు, మండల కాంగ్రెస్ నాయకుడు గణేశుల రవి కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

అంబటి కుటుంబానికి పరామర్శ



వీరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మల్లు నందిని

చింతకాని, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు తండ్రి వీరయ్య ఇటీవల మృతి చెందడంతో కుటుంబాన్ని సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని పరామర్శించారు. కార్యక్రమంలో కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, అంబటి శాంతయ్య నారపోగు కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముదిగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పండ్రేగుపల్లి గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కొనుగోలు కేం ద్రాన్ని ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకు లయలగొండస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, మాజీ జడ్పీటీసీలు మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, సీఈవో వెంకటరత్నం, నాయకులు మల్లెల అజయ్, ఉసికల రమేష్, పసుపులేటి వెంకట్, అమరయ్య పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ యలగొండస్వామి

ఆర్డీవో చొరవతో ధాన్యం దిగుమతి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

పెనుబల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లు దిగుమతి చేసుకొనేందుకు ముందుకురాకపోవడంతో కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేంద్రగౌడ్ చొరవతో ధాన్యాన్ని సోమవారం మిల్లర్లకు అప్పగించారు. మండలంలోని మండాలపాడు గ్రామంలో ఐకేపీ కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లు దిగుమతి చేసుకోకపోవడంతో రైతులు, ఐకేపీ అధికారులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం మండాలపాడులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో మిల్లర్లను సంప్రదించి ధాన్యం దిగుమతి చేసుకొనేలా ఏర్పాట్లు చేసి సమస్యను పరిష్కరించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. గన్నీసంచుల కొరత కూడా ఉందని రైతులు ఆర్డీవో దృష్టికి తీసుకురావడంతో అధికారులు పరిష్కరించారు. తహసీల్దార్ గంటా ప్రతాప్, ఐకేపీ ఏపీఎం నాగపుల్లారావు, సిబ్బంది పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

» గాంధీనగరం గ్రామస్థులు



మాట్లాడుతున్న గిరిజనులు

కారేపల్లి, నవంబరు18(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు సంబంధించిన మాభూములను కాజేసుందుకు ప్రయత్నిస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని గాంధీనగరం గ్రామానికి గ్రామస్థులు కోరారు. సోమవారం ఈ విషయమై పలువురు గిరిజనులు పోలీసస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాతలు నాటిభూమిని కొడులకు సమానంగా పంచినప్పటికీ, కొందరు వ్యక్తులు భూమిలో సగం వస్తుందని గ్రామానికి చెందిన వీసల వెంకన్న అనే వ్యక్తితో పాటు భరత్, కృష్ణకాంత్, సాయితో పాటు మరికొంత మంది తమ పంటభూములపైకి వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. తమ భూములపై హైకోర్టు, జిల్లా కలెక్టర్ కోర్టు తమకు అనుకూలంగా అనుమతులు ఇచ్చాయన్నారు. అయిన కొందరు తమను బెదిరించి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. ఈకార్యక్రమంలో వీసాల ఎర్రయ్య, కృష్ణయ్య, సుగణమ్మ, వీసాల పెద్ద ఎర్రయ్య, కొడెం సత్యం, వీసాల బాయమ్మ, కొడెం ఉమ, ఈ సాల విజయ, కొడెం విజయ తదితరులు పాల్గొన్నారు.

ఆషా మెమోరియల్ కప్ విజేత మణుగూరు

సత్తుపల్లి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఆషా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా మణుగూరుకు చెందిన మజ్జు టీమ్ గెలుచుకోగా, రన్నరప్‌గా సత్తుపల్లికి చెందిన టీఎస్‌బీ టీమ్ నిలిచింది. సోమవారం స్థానిక జేవీఆర్ మైదానంలో నిర్వహించిన ఈ టోర్నీలో విజేతలతో పాటు ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ దంపతుల కుమార్తెలు విపంచి, విరాజీలు అందజేశారు. పలువురు క్రీడాకారులు తమ ప్రతిభతో మెడల్స్ రాబట్టుకోవడం హర్షించదగ్గ విషయమని పట్టణ సీఐ టీ.కిరణ్ తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయిలో మొత్తం 16జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో విజేతకు రూ.50 వేలు, రన్నరప్‌కు రూ.30వేల నగదుతో పాటు మెమెంటోలను నిర్వహకులు అందజేశారు.



మాట్లాడుతున్న పట్టణ సీఐ కిరణ్

డ్రైవర్ నిర్లక్ష్యంతో మినీ వ్యాన్ బోల్తా

» 28మంది కూలీలకు తప్పిన పెనుప్రమాదం



ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన కూలీలు

తల్లాడ/కల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడుపుతున్న మినీ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిలో ప్రమాద సమయంలో ఇతర వాహనాలు రాకపోవడంతో మినీ వ్యాన్‌లో ఉన్న 28మంది కూలీలకు పెనుప్రమాదం తప్పింది. ఈ సంఘటన సోమవారం నర్సింహారావుపేట వద్ద తల్లాడ-భద్రాచలం ప్రధాన రహదారిలో చోటుచేసుకుంది. ఏన్కూరు మండలం ఇమామ్‌నగర్ నుంచి కల్లూరు మండలం కొర్లగూడెం వెళ్తున్న మినీ వ్యాన్ డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూ నడుపుతుండటంతో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాద సమయంలో కొర్లగూడెం గ్రామానికి చెందిన 28 మంది కూలీలున్నారు. ఇమామ్‌నగర్‌లో పత్తి తీసేందుకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు మినీ వ్యాన్‌లో వీరంతా ప్రయాణిస్తున్న సమయంలో ఈ ప్రమాదంజరిగింది.

జాతీయ బాలోత్సవంలో వైరా విద్యార్థుల ప్రతిభ

వైరా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మధిరలో జరిగిన జాతీయ బాలోత్సవంలో వైరాలోని వాణీ వివేకానంద విద్యాలయ విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు. సీనియర్ జానపద నృత్య విభాగంలో ద్వితీయ బహుమతి చాటుకొని మిగిలిన అన్ని విభాగాల్లో ప్రథమ బహుమతులు సాధించారు. ఈ విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ చుండూరి కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ చుండూరి వాణీ, కన్వీనర్ గింజుపల్లి జనార్ధన్, గాయని షేక్.బేగం, డ్యాన్స్‌మాస్టర్లు కిరణ్, ఉమ అభినందించారు.



బహుమతులు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

ఆర్టీసీ బస్సులు ఆపాలని విద్యార్థుల ఆందోళన



ఎస్ఐకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు

ఏన్కూరు నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులు ఆపాలని కోరుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. గ్రీవెన్స్‌లో తహసీల్దార్‌కు, పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ రఫికి వినతిపత్రం అందించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిక్వెస్టుబస్టాప్‌లో కొన్నినెలల నుంచి బస్సులు ఆపడం లేదని, దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో వాపోయారు. ఈకార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు నరసింహారావు, రామారావు, షాజీద్, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్ష

కొణిజర్ల, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్ష సోమవారంతో ప్రశాంతంగా ముగిసింది. మొదటి రోజు పేపర్-1, పేపర్-2 నిర్వహించగా, రెండవ రోజు పేపర్-3 నిర్వహించారు. రెండవ రోజు మొత్తం 2,344 మంది అభ్యర్థులకు గాను 1,174 మంది హాజరుకాగా, 1,170 మంది గైర్హాజరయ్యారు. మండలంలో ఉన్న ఏడు పరీక్షా కేంద్రాల వద్ద పోలీసలు బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణం మధ్య అభ్యర్థులు పరీక్షలు రాశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



ట్రోఫీతో రామ్‌చరణ్

వైరా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు అండర్-14విభాగంలో మధు విద్యాలయ విద్యార్థి తాళ్లూరి రామ్‌చరణ్ ప్రతిభ చాటుకున్నాడు. ఈనెల 16 నుంచి 18వతేదీ వరకు మెదక్ జిల్లా చేగుంటలో జరిగిన బాలుర అండర్-14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి ఖమ్మంజిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఈ జట్టుకు మధు విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న రామ్‌చరణ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించడమే కాకుండా ప్రథమ బహుమతి సాధించడంలో కీలకంగా వ్యవహరించాడు. రామ్‌చరణ్‌ను పాఠశాల చైర్మన్ మల్లెంపాటి వీరభద్రరావు, కరస్పాండెంట్ మల్లెంపాటి రంజిత్, చారి తదితరులు అభినందించారు.

మిషన్ భగీరథ పైపులైన్‌కు కరువైన రక్షణ

వైరా, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలను గాలికి వదిలేసి అక్రమాలకు పా ల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యం గా వాగులు, వంకలు, కాల్వల్లో పైపులైన్ పటిష్ఠత గాలికి వదిలేశారనే విమర్శలు విన్పిస్తున్నాయి. సిమెంట్ బెడ్ కాంక్రీట్‌తో నిర్మించాల్సిన ఈ పైపులైన్‌ను నాణ్యత లేకుండా భూమిలో వేసి వదిలేశారు.

ఫలితంగా సెప్టెంబరు మొదట్లో వచ్చిన భారీ వర్షాల సమయంలో వరదలకు భూమి మొత్తం కోతకు గురై పైపులైన్ బయటపడింది. ఇప్పుడు వాగులో ప్రవహిస్తున్న నీటిపైనే ఈ పైపులైన్ తేలి ఆడుతుంది. ముఖ్యంగా వైరాకు సమీపంలోని మధిర రోడ్డులో ఇందిరమ్మ కాలనీ వద్ద నల్లచెరువు వాగులో మిషన్ భగీరథ పైపులైన్ బయటకు కన్పిస్తుంది. సెప్టెంబరులో ఈ వాగుకు వచ్చిన వరదలతో కట్టలు మొత్తం కొట్టుకుపోయాయి. పైపులైన్ బయటపడింది. ఈ వాగు వద్ద సిమెంట్ బెడ్ కాంక్రీట్ వేసి పైపులైన్‌ను నిర్మించి ఉంటే ఇప్పుడు ఈ పైపులైన్ బయట పడేది కాదు. కనీసం పైపులైన్ అడుగుభాగంలో ఇసుకను కూడా పోయలేదు. కేవలం కందకం తీసి మట్టిలోనే పైపులైన్ వేసి దాని పటిష్ఠత, నాణ్యతను గాలికి వదిలేశారు. ఇదే తరహాలో జింకలగూడెం వద్ద వాగు, కాల్వల్లో పైపులైన్ మట్టిలో నిర్మించడం వలన వరదలతో మట్టి కొట్టుకుపోయి పైపులైన్ బయటకు కనిపిస్తుంది. 300డయా డీఐ ఈ పైపులైన్‌ను సిమెంట్ బెడ్ కాంక్రీట్‌తో నిర్మించాల్సి ఉండగా మట్టిలో పూడ్చి చేతులు దులుపుకొని భారీగా నిధులు కాజేశారనే ఆరోపణలున్నాయి. ఈ పైపులైన్‌కు రక్షణ లేని కారణంగా ఎప్పుడైనా దెబ్బతిని మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిల్చిపోయే ప్రమాదముంది. అదే జరిగితే మళ్లీ ప్రభుత్వంపై అదికార భారం పడటమేకాకుండా, తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందిపడే అవకాశముంది. ఇప్పటికైనా సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని వాగులు, వంకలు, కాల్వల్లో బయటపడిన పైపులైన్‌ను సిమెంట్ బెడ్ కాంక్రీట్‌తో పటిష్ఠపర్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



నల్లచెరువు వాగులో బయటపడిన మిషన్ భగీరథ పైపులైన్

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు

ఎర్రుపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం ప్రత్యేకపూజల్లో భాగంగా సోమవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఆలయప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు..